ONE PERSON CAN MAKE DIFFERENCE
B.K. YADAV FOUNDATION

# వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

శనివారం,
మే 10, 2025

సంపుటి : 10 | సంచిక :14 | రంగారెడ్డి | ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ | పేజీలు 8 | వెల 4/-





# మూడోరోజూ దద్దరిల్లిన సరిహద్దు

26 ప్రాంతాల్లో డ్రోన్ దాడుల్ని తిప్పికొట్టిన భారత్

విమానాశ్రయాలు, సైనిక కేంద్రాలపై ప్రయోగించినవి నిర్వీర్యం

శ్రీనగర్ ఎయిర్‌పోర్ట్, అవంతీపొరా ఎయిర్‌బేస్ సురక్షితం

పంజాబ్, కశ్మీర్‌లలోని నగరాల్లో బ్లాకౌట్

చొరబాట్లకు యత్నించిన ఏడుగురు ఉగ్రవాదుల హతం

ప్రాదేశిక సైన్యం సేవల వినియోగానికి అనుమతి

త్రివిధ దళాధిపతులతో ప్రధాని మోదీ భేటీ

భద్రతపై అమిత్ షా, రాజ్‌నాథ్ సమీక్షలు

సరిహద్దు గ్రామాల జనం ఇళ్లలోనే ఉండాలని ఆదేశాలు

పాక్ మనపైకి పంపిన 300-400 డ్రోన్లు తుర్కియే దేశానివే

పౌర విమానాలే రక్షణ కవచంగా పాక్ దుశ్చర్యలు

**జమ్మూ/శ్రీనగర్, ఢిల్లీ:** దాయాది దేశం పాకిస్థాన్‌కు మళ్లీ భంగపాటు తప్పలేదు. రెండు దేశాల సరిహద్దు ప్రాంతాల్లో శుక్రవారం పగటిపూట కాస్త ప్రశాంతత నెలకొన్నా చీకటి చిక్కబడిన తర్వాత మరోసారి భారత్‌పై దుస్సాహసానికి ఒడిగట్టింది. బారాముల్లా నుంచి భుజ్ వరకు 26 ప్రాంతాలపైకి వరసగా డ్రోన్లు పంపింది. ముఖ్యంగా శ్రీనగర్ విమానాశ్రయాన్ని, అవంతీపొరా వైమానిక స్థావరాన్ని లక్ష్యంగా చేసుకుని పంపిన డ్రోన్లను భారత సైన్యం విజయవంతంగా నిర్వీర్యం చేసి సత్తా చాటుకుంది. డ్రోన్లు, క్షిపణులతో విరుచుకుపడాలనే ప్రయత్నాన్ని గురువారమే సైన్యం తిప్పికొట్టగా ఏమాత్రం బుద్ధిమారని పాక్ మరోసారి విఫలయత్నం చేసి, చేతులు కాల్చుకుంది. జమ్మూ, ఫిరోజ్‌పుర్, పఠాన్‌కోట్, జైసల్మేర్, బాడ్‌మేడ్, భుజ్ తదితర ప్రాంతాలపై వీటిని మళ్లీ పంపేందుకు ప్రయత్నించింది. బారాముల్లా జిల్లాలో పాక్ డ్రోన్లను సైన్యం పేల్చివేస్తుంటే ఆకాశమంతా వెలుగులు కనిపించాయి. సరిహద్దు రాష్ట్రాల్లో కొన్నిచోట్ల బాంబుపేలుళ్లు వినిపించడంతో అప్పటికప్పుడు విద్యుత్తు సరఫరా నిలిపివేసి 'బ్లాకౌట్' పాటించారు. ఆ మేరకు ప్రజలకు సూచనలు జారీ అయ్యాయి. అంతర్జాతీయ సరిహద్దు వెంబడి జమ్మూ, సాంబ జిల్లాల్లో ఫిరంగులతో భారీగా శత్రుమూకలు

మిగతా 2లో

# ధాన్యం సేకరణలో ప్రభుత్వం విఫలం



జిల్లాకు ముగ్గురు మంత్రుల ఉన్నా శూన్యం

ఎక్కడి సమస్యలు అక్కడే అన్నచందంగా పాలన

స్థానిక ఎన్నికల్లో సత్తాచాటి బుద్ధి చెబుతాం

ఖమ్మం పర్యటనలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**ఖమ్మం:** ధాన్యం కొనుగోళ్లు చేయడంలో ప్రభుత్వం విఫలమైంది. రుణమాఫీ కూడా చేయలేకపోయారు. ఒక్క జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నారు, మన ప్రభుత్వం పోయాక ముగ్గురుకి పదవులు వచ్చాయి..అయినా సమస్యలు మాత్రం తీరడం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. తొందర్లోనే స్థానిక ఎన్నికలు వస్తాయని, స్థానిక ఎన్నికల్లో సీరియస్‌గా పోటీ- చేస్తామని కేటీఆర్ అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో 50 ఏళ్లు మోసపోయాం అని, మళ్లీ మోసపోవద్దని కేసీఆర్ చెప్పారని.. కానీ తాత్కాలికంగా మోసపోయాం అని పేరొన్నారు. ధాన్యం కొనుగోళ్లు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం అయిందని, రుణమాఫీ కూడా చేయలేకపోయిందని మండిపడ్డారు. రైతుబంధు మొదటి పంటకే గతి లేదు అని ఎద్దేవా చేశారు. పేదలకు అండగా నిలిచేది బీఆర్ఎస్ మాత్రమే అని కేటీ-ఆర్ చెప్పుకొచ్చారు. ఖమ్మం జిల్లాలో పర్యటించిన కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. పాకిస్థాన్‌తో యుద్ధ వాతావరణం ఉంది, రాజకీయాలు మాట్లాడాల్సిన సమయం కాదు ఇది. సీతారామ ప్రాజెక్టును కేసీఆర్ నిర్మాణం చేపట్టారు. డిప్యూటీ-సీఎం భట్టి మధిరలో గెలవడానికి బాండ్ పేపర్ మీద సంతకాల చేసి

మిగతా 2లో

# మాది టీ20 నమూనా

తెలంగాణను చైనా ప్లస్‌గా తీర్చిదిద్దుతున్నాం

విధానాల రూపకల్పన, అమలులో వేగంగా పనిచేస్తున్నాం

రాష్ట్రాన్ని ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా మార్చడమే లక్ష్యం

ఈ మేరకు దక్షిణాదికి ఊతమిచ్చేలా లోక్‌సభలో స్థానాలుండాలి

'ది హిందూ' సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్:** "అమెరికా, చైనాల మధ్య పన్నుల యుద్ధాన్ని మనం చూస్తున్నాం. ఈ సమయంలో తెలంగాణకు పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా అన్ని రకాల ఉత్పత్తులను ఇక్కడే తయారయ్యేలా ప్రణాళికలు రూపొందించాం. చైనా ప్లస్‌గా తెలంగాణను తీర్చిదిద్దాలన్నదే మా లక్ష్యం. ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఇతర పరిశ్రమల స్థాపనకు మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యమిస్తున్నాం. విధానాల రూపకల్పన, అమలులో టీ20 మోడల్‌లో పనిచేస్తున్నాం" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. 'ది హిందూ' పత్రిక బెంగళూరులో నిర్వహించిన ఒక కార్యక్రమంలో శుక్రవారం ఆయన జూమ్ మాధ్యమం ద్వారా పాల్గొని మాట్లాడారు. "దావోస్ వేదికగా తెలంగాణకు రూ.3 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించాం. ఏపీలోని మచిలీపట్నం నుంచి తెలంగాణకు రహదారి నిర్మాణం

మిగతా 2లో



# అగ్నివీరుడా వందనం..

యుద్ధ క్షేత్రంలో నేలరాలిన తెలుగుబిడ్డ

ఆపరేషన్ సిందూర్‌లో పాక్‌పై పోరాటం

జమ్మూ కశ్మీర్‌లో అమరుడైన మురళీనాయక్

శ్రీసత్యసాయి జిల్లా కళ్లితండాలో విషాదం

**గోరంట్ల:** 'ఆపరేషన్ సిందూర్'లో తెలుగుబిడ్డ వీరమరణం పొందారు. సరిహద్దుల్లో దేశమాత కోసం పోరాడుతూ నేలకొరిగాడు. మారుమూల తండాలో నిరుపేద కుటుంబంలో జన్మించిన మురళీనాయక్ (25)కు చిన్నతనం నుంచి సైన్యంలో చేరాలని కోరిక. అదే మక్కువతో

మిగతా 2లో

# అన్ని జిల్లా కేంద్రాల్లో విద్యుత్తు సామగ్రి స్టోర్లు

2030 నాటికి గరిష్ఠ విద్యుత్తు డిమాండ్ 24,215 మెగావాట్లు

విద్యుత్తుశాఖ సమీక్షలో ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క



**హైదరాబాద్:** రాష్ట్రంలో 2030 నాటికి విద్యుత్తు గరిష్ఠ డిమాండ్ 24,215 మెగావాట్లకు చేరుతుందని, ఈ డిమాండ్‌ను ఎదుర్కొనేందుకు విద్యుత్తు ఉత్పత్తి సంస్థలు, సింగరేణి, ఎన్టీపీసీ ఉత్పాదకతపై దృష్టి పెట్టాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఇప్పటివరకు పూర్వజిల్లా

మిగతా 2లో



# అర్హులైన జర్నలిస్టులకు త్వరలో ఇందిరమ్మ ఇళ్లు

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**నాంపల్లి:** అర్హులైన జర్నలిస్టులందరికీ త్వరలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేదలైన విలేకరులు, వృత్తి నిర్వహణలో చనిపోయిన వారి కుటుంబాలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు. మండల, నియోజకవర్గ స్థాయిలో పనిచేస్తున్న వారిని ఆదుకోవడానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తామని వెల్లడించారు. విధి నిర్వహణలో చనిపోయిన జర్నలిస్టుల

మిగతా 2లో

# హైదరాబాద్ వేదికగా అతివల అందాల పోటీలు

నేడు గచ్చీబౌలి స్టేడియంలో ప్రారంభం

తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలకు పెద్దపీట

ఆకట్టుకోనున్న కళారూపాల ప్రదర్శనలు

రామాచారి బృందంతో అందెశ్రీ తెలంగాణ గీతాలాపన

ఇప్పటికే నగరానికి చేరుకున్నసుందరీమణులు

మిస్‌వరల్డ్-2024 క్రిస్టినాకు ఘనంగా స్వాగతం

**హైదరాబాద్:** మిస్ వరల్డ్ పోటీలకు హైదరాబాద్ నగరం ముస్తాబైంది. శనివారం గచ్చిబౌలి ఇండోర్ స్టేడియం వేదికగా పోటీలు ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే వివిధ దేశాలకు చెందిన అందాల భామలు నగరానికి చేరుకున్నారు. 'మిస్ వరల్డ్- 2024' విజేతగా నిలిచిన చెక్ రిపబ్లిక్ సుందరి క్రిస్టినా పిస్కోవా శుక్రవారం వచ్చారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్న క్రిస్టినాకు తెలంగాణ అధికారులు ఘనస్వాగతం పలికారు. కళాకారులు సంప్రదాయ రీతిలో ఆమెను

మిగతా 2లో



# మూడోరోజూ దద్దరిల్లిన సరిహద్దు

మొదటి పేజీ తరువాయి



విరుచుకుపడ్డాయి. వాటితోపాటు పఠాన్‌కోట్, ఉధంపుర్, నగ్రోటా, జైసల్మేర్, అఖ్నూర్ ప్రాంతాలపైకి పాక్ పంపిన 50 డ్రోన్లను భారత ఆర్మీ కూల్చేసింది. శ్రీనగర్ ప్రజలకు ముందు జాగ్రత్తలు చెప్పడానికి మసీదుల్లోని లౌడ్ స్పీకర్లను వాడాల్సి వచ్చింది. జమ్మూ డివిజన్ ఉధంపుర్‌లో పూర్తిగా బ్లాక్ అవుట్ పాటించారు. ఆ ప్రాంతంలో భారీగా సైరన్ శబ్దాలు వినిపిస్తున్నాయి. జమ్మూ, అఖ్నూర్, జైసల్మేర్, హరియాణాలోని అంబాలా, పంచ్‌కుల, పంజాబ్‌లోని ఫిరోజ్‌పుర్, అమృత్‌సర్, హోషియార్‌పుర్, మోగా, జలంధర్, ఫజిల్కా సహా పలు సరిహద్దు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేశారు.

**అటువైపు భారీ నష్టం?**

పుంఛ్, రాజౌరీ, ఉరీ సెక్టార్లలో దాడుల్ని భారత సైన్యం తిప్పికొట్టినప్పుడు పాక్‌కు పెద్దఎత్తున నష్టం వాటిల్లిందని తెలుస్తోంది. మరో సరిహద్దు రాష్ట్రమైన రాజస్థాన్‌లోని జైసల్మేర్‌లో గగనతల దాడులకు పలుమార్లు హెచ్చరికలు జారీ అయ్యాయి. పాక్ నుంచి వస్తున్న డ్రోన్లను గాల్లోనే మన వ్యవస్థలు పేల్చేశాయి. పోఖ్రాన్‌లోనూ సైరన్లు మోగించి విద్యుత్తు నిలిపేశారు. జోధ్‌పుర్, బాడ్‌మేడ్, శ్రీగంగానగర్ వంటిచోట్లా పూర్తిగా చీకట్లు అలముకున్నాయి. ఈ రాష్ట్రంలోని ఐదు సైనిక స్థావరాలపై పాక్ దృష్టి పడటంతో అత్యంత అప్రమత్తత ప్రకటించారు. కశ్మీర్ లోయలోనూ బ్లాకౌట్ పాటించారు. ఇళ్లలోనే ఉండాలని, లైట్లు ఆపేయాలని పోలీసులు సూచించారు. జమ్మూలో, దక్షిణ కశ్మీర్‌లోని పలు ప్రాంతాల్లో పేలుళ్ల శబ్దాలు వినిపించాయి. జమ్మూ, సాంబా, పఠాన్‌కోట్ జిల్లాల్లో డ్రోన్లను గుర్తించి కూల్చివేసినట్లు రక్షణశాఖ వర్గాలు తెలిపాయి. ఉధంపుర్, నగ్రోటాల్లోనూ డ్రోన్లకు ఇదే గతి పట్టించారు.

**దీటుగా బదులిచ్చాం**

చీకట్లో దొంగదెబ్బ కొట్టడానికి పాకిస్థాన్ గురువారం రాత్రి వేర్వేరు రూపాల్లో చేసిన అన్ని ప్రయత్నాలకు దీటుగా జవాబిచ్చినట్లు భారత సైన్యం ప్రకటించింది. పశ్చిమ సరిహద్దులో డ్రోన్లు, మందుగుండు సామగ్రితో విరుచుకుపడిన పాక్‌కు తగిన రీతిలో సమాధానం లభించిందని తెలిపింది. జమ్మూలో పాక్ సరిహద్దు ద్వారా మన దేశంలోకి చొరబడేందుకు ప్రయత్నించిన ఏడుగురు ఉగ్రవాదుల్ని సైన్యం మట్టుబెట్టింది. పాక్ ప్రయోగించిన ఫిరంగి గుళ్ల వల్ల పుంఛ్ జిల్లాలో ఒక పౌరుడు ప్రాణాలు కోల్పోయారు. పెద్దశబ్దాలతో పేలుళ్లు సంభవించగా వెంటనే సైరన్లు మోగించి, విద్యుత్తు సరఫరా నిలిపివేశారు. విమానాశ్రయాలు, కీలకమైన ప్రాంతాల్లో భద్రతను మరింత పెంచారు. అత్యవసర వ్యవస్థల పనితీరును కేంద్రం ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తోంది. అవసరమైతే ప్రాదేశిక సైన్యం (టీఏ) సేవల్ని వినియోగించుకునేందుకు కేంద్ర సర్కారు అనుమతి మంజూరు చేసింది. రాష్ట్రాల్లో, ముఖ్యంగా సరిహద్దు ప్రాంతాల్లో ఆస్తులకు, ప్రాణాలకు నష్టం వాటిల్లకుండా మరిన్ని చర్యలు తీసుకున్నారు. ప్రజలు తమ ఇళ్లలోనే ఉండాలని, బాల్కనీల్లోకి రావద్దని చండీగఢ్‌లో సైరన్లు మోగించారు. దిల్లీలో పలుచోట్ల సైరన్లతో హెచ్చరించే వ్యవస్థలు ఏర్పాటు చేస్తున్నారు. ఉత్తర, పశ్చిమ ప్రాంతాల్లో కనీసం 24 విమానాశ్రయాల్లో ఈ నెల 15 వరకు పౌరవిమాన సర్వీసుల రాకపోకలను నిలిపివేశారు. చండీగఢ్, శ్రీనగర్, అమృత్‌సర్, లుధియానా, భుంటార్, కిషన్‌గఢ్, పటియాలా, శిమ్లా, ధర్మశాల, బఠిండా, జైసల్మేర్, జోధ్‌పుర్, లేహ్, బీకానేర్, పఠాన్‌కోట్, జమ్మూ, జామ్‌నగర్, రాజ్‌కోట్, భుజ్ తదితర విమానాశ్రయాలను మూసివేసినట్లు పౌరవిమానయాన శాఖ ప్రకటించింది. మార్కెట్లు, రైల్వేస్టేషన్లు, పార్కులు, మెట్రో స్టేషన్లలో నిఘా పెంచారు. బాంబు నిర్వీర్యక దళాలతో తనిఖీలు కొనసాగుతున్నాయి.

**సీనియర్ అధికారులతో సమాలోచనలు**

జాతీయ భద్రతా సలహాదారు అజీత్ డోభాల్, సరిహద్దు భద్రత దళం (బీఎస్ఎఫ్), కేంద్ర పారిశ్రామిక భద్రత దళం (సీఐఎస్ఎఫ్) డైరెక్టర్ జనరళ్లు, హోంశాఖ సీనియర్ అధికారులతో అమిత్‌షా భేటీ అయ్యారు. సరిహద్దులో, విమానాశ్రయాల్లో భద్రత ఏర్పాట్లపై సమీక్షించారు. జమ్మూకశ్మీర్‌లోని సాంబ జిల్లాలో సరిహద్దు దాటి చొరబడేందుకు యత్నించిన పాక్ ఉగ్రవాదుల్ని గురువారం రాత్రి 11 గంటల సమయంలో గుర్తించి వారిలో కనీసం ఏడుగురిని మట్టుపెట్టినట్లు బీఎస్ఎఫ్ తెలిపింది. ఈ సంఖ్య ఇంకా ఎక్కువే ఉండవచ్చని పేర్కొంది. వారి చొరబాటుకు వీలుగా పాక్ రేంజర్లు ధన్‌ధార్‌లోని గస్తీ శిబిరం నుంచి కాల్పులు జరుపుతుండటంతో దానినీ, అక్కడి ఒక బంకర్‌ను మన దళాలు ధ్వంసం చేశాయి. సరిహద్దుల్లో శత్రు దేశానికి చెందిన పలు సైనిక శిబిరాలను మన దళాలు ధ్వంసం చేశాయి. దానికి సంబంధించిన వీడియోను భారత సైన్యం విడుదల చేసింది. ట్యాంకు విధ్వంసక క్షిపణులతో వీటిని ధ్వంసం చేసినట్లు తెలుస్తోంది.

**చండీగఢ్‌లో సైరన్లు**

చండీగఢ్‌లో ఉదయం మళ్లీ ఎయిర్ సైరన్ శబ్దాలు వినిపించాయి. పాక్ నుంచి దాడులు జరిగే అవకాశం ఉందంటూ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ హెచ్చరించింది. ప్రజలంతా ఇళ్లల్లోనే ఉండాలని, బాల్కనీల్లోకి కూడా రావొద్దని తెలిపింది. పంచ్‌కుల, మొహాలీ, పటియాలా, అంబాలాలోనూ ఇదే విధమైన హెచ్చరికలు చేశారు. జమ్మూలోనూ సైరన్లు మోగాయి. తెల్లవారుజామున 4.15 గంటల ప్రాంతంలో పేలుడు శబ్దాలు వినిపించడంతో నగరాన్ని బ్లాకౌట్ చేశారు. జమ్మూకశ్మీర్, రాజస్థాన్, పంజాబ్, హరియాణా సరిహద్దు ప్రాంతాల్లో పాక్ దాడులన్నింటినీ భారత సైన్యం సమర్థంగా తిప్పికొట్టింది.

**గగనతలాన్ని మూసివేయని దాయాది దేశం**

"పాకిస్థాన్ డ్రోన్, క్షిపణి దాడులు మొదలుపెట్టినప్పటికీ.. అక్కడి పౌర విమానాలకు గగనతలాన్ని మూసివేయలేదు. కరాచీ, లాహోర్ మధ్య విమాన సర్వీసులు నడుస్తూనే ఉన్నాయి. తమ దాడులకు భారత్ నుంచి ప్రతిస్పందన ఉంటుందని తెలిసీ.. పౌర విమానాలను పాకిస్థాన్ రక్షణ కవచంగా వాడుకుంటోంది. ఇది భారత్–పాక్ మధ్య అంతర్జాతీయ సరిహద్దు సమీపంలో వెళ్లే విమానాలతోపాటు అక్కడి పౌర విమానాలకు సురక్షితం కాదు. అంతర్జాతీయ విమానాలను దృష్టిలో ఉంచుకొని భారత వాయుసేన పూర్తి సంయమనంగా వ్యవహరించింది" అని సోఫియా ఖురేషీ, వ్యోమికా సింగ్‌లు వెల్లడించారు. పాక్ దాడులకు స్పందనగా ఆ దేశానికి చెందిన నాలుగు గగనతల రక్షణ వ్యవస్థలపై మన సైన్యం సాయుధ డ్రోన్లతో దాడి జరిపిందని, వాటిలో ఒకటి ఎయిర్ డిఫెన్స్ రాడార్‌ను నాశనం చేసిందని వివరించారు. కాంధాన్, ఉరీ, పుంఛ్, మెందెర్, రాజౌరీ, ఉధంపూర్‌లలో పాక్ శతఘ్నుల దాడుల్లో మన సైనికులకు కొంత నష్టం వాటిల్లిందని, మన ఎదురుదాడిలో పాక్‌కు ఎక్కువ నష్టం కలిగిందని చెప్పారు.

**డ్రోన్ దాడుల్లో పాత్రలేదు: పాక్**

ఇస్లామాబాద్: భారత్‌లోని పఠాన్‌కోట్, జైసల్మేర్, శ్రీనగర్ సహా పలు ప్రాంతాల్లోకి తమ డ్రోన్లు వెళ్లి దాడి చేశాయన్న వార్తల్ని పాకిస్థాన్ ఖండించింది. భారత్ జరిపిన దాడికి తగురీతిలో సమాధానం ఇచ్చేదాకా ఉద్రిక్తతల నివారణ సాధ్యంకాదని చెప్పింది.

**త్రిదళాధిపతులతో ప్రధాని మోదీ సమావేశం**

సైనిక ఘర్షణల వేళ ప్రధాని నరేంద్ర మోదీ త్రివిధ దళాల అధిపతులతో శుక్రవారం రాత్రి సమావేశమయ్యారు. దీనిలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, భద్రతా సలహాదారు అజీత్ డోభాల్ పాల్గొన్నారు. సరిహద్దులోని తాజా పరిస్థితిని సమీక్షించారు. సరిహద్దు రాష్ట్రాలైన రాజస్థాన్, గుజరాత్, పంజాబ్ ముఖ్యమంత్రులతో ఫోన్‌లో మోదీ మాట్లాడారు. త్రివిధ దళాల మాజీ అధిపతులతో సహా పలువురితో ఆయన మాట్లాడారు. అంతకుముందు రాజ్‌నాథ్ సింగ్ సైనిక ఉన్నతాధికారులతో భేటీ అయ్యారు. వీరిలో త్రిదళాధిపతి అనిల్ చౌహాన్ సహా త్రివిధ దళాల అధిపతులు ఉన్నారు. ఉద్రిక్తతలు కొనసాగుతున్నవేళ సరిహద్దు రాష్ట్రాలు అప్రమత్తమయ్యాయి. ముందస్తు చర్యలు చేపట్టాయి.

**పలుమార్లు పాక్ చొరబాటు**

ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించి విదేశీ వ్యవహారాల శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ, కర్నల్ సోఫియా ఖురేషీ, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ మీడియాతో మాట్లాడారు. పాక్ ప్రయత్నాలను మన దళాలు వమ్ము చేశాయని మిస్రీ చెప్పారు. ప్రార్థన స్థలాలపై దాడులు చేసి దానికి భారత సైన్యంపై నిందలు మోపడం పాక్ దుష్ట పన్నాగానికి నిదర్శనమన్నారు. ప్రస్తుత పరిస్థితికి మతం రంగు పులిమేందుకు పొరుగుదేశం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. నంకానా సాహిబ్ గురుద్వారాపై డ్రోన్ దాడికి భారత్ గురిపెట్టిందన్న ఆరోపణలు పచ్చి అబద్ధమని తోసిపుచ్చారు. ప్రస్తుత పరిస్థితుల్లో కర్తార్‌పుర్ సాహిబ్ నడవాను మూసివేశామని చెప్పారు. మన సైనిక స్థావరాలే లక్ష్యంగా పశ్చిమ సరిహద్దుప్రాంతంలో పాకిస్థాన్ సైన్యం భారత గగనతలాన్ని అనేకమార్లు ఉల్లంఘించినట్లు వ్యోమికా సింగ్ తెలిపారు. నియంత్రణ రేఖతోపాటు అంతర్జాతీయ సరిహద్దు వెంబడి భారీ ఆయుధాలతో దాడులకు పాల్పడ్డారని చెప్పారు. 36 ప్రాంతాల్లో చొరబాటుయత్నాల కోసం 300–400 డ్రోన్లు ఉపయోగించారని, మన సైన్యం అనేక డ్రోన్లను కూల్చిందని చెప్పారు. డ్రోన్ శిథిలాలపై ఫోరెన్సిక్ దర్యాప్తు కొనసాగుతోందని చెప్పారు. తుర్కియేకు చెందిన 'ఆసిస్‌గార్డ్ సోంగర్' డ్రోన్లను ప్రయోగించినట్లు ప్రాథమిక సమాచారం ప్రకారం తెలిసిందన్నారు.

## మొదటి పేజీ తరువాయి

### ధాన్యం సేకరణలో ప్రభుత్వం విఫలం

నీటికి వచ్చిన వాగ్దానాలు చేశారు. 125 ఏళ్ల చరిత్ర గలిగిన పార్టీ అని భట్టి చెప్పారు.. ఇప్పుడు ఆ హామీలు ఏమయ్యాయి. 17 నెలల తర్వాత వున్న స్కీములు పోయాయి. ఇప్పుడు కేసీఆర్ కిట్ పోయింది. రైతుబంధు మొదటి పంటకే గతి లేదు. ఫ్రీ బస్, తులం బంగారం అన్నారు.. ఎటుపోయాయి. ఖమ్మం జిల్లా అంతా మార్పు అన్నారు. ఇప్పుడు ఏమి అయ్యింది' అని కేటీ–ఆర్ ప్రశ్నించారు. అయిదేళ్లు మేము ప్రక్కకు ఉంటాము. ఆరు గ్యారెంటీ–లు, 420 హామీలు ఇచ్చారు. వాటిని మేము వదిలిపెట్టేది లేదు. రేవంత్ రెడ్డి మాదిరిగా ఏ సీఎం కూడా ఇలా మాట్లాడలేదు. ఢిల్లీకి పోతే రేవంత్ రెడ్డిని దొంగల మాదిరిగా చూస్తున్నారు అని అంటు–న్నారు. నిజమే రేవంత్ రెడ్డి దొంగే కదా. ఓ సీఎం అలా మాట్లాడవచ్చా. రేవంత్ రెడ్డిని చూస్తే కేంద్రం దొంగలా చూస్తోంది. ఒక్క ఓటు–కి శిక్ష అయిదేళ్లు. తొందర్లోనే స్థానిక ఎన్నికలు వస్తాయి, సీరియస్‌గా పోటీ–చేస్తాం. నాయకులూ ప్రజల్లో ఉండాలి, ధాన్యం కల్లాల వద్ద మనమే ఉండాలి. ఇక్కడ ఎమ్మెల్యేని గెలిపించాం, కాంగ్రెస్ లో చేరారు. భద్రాచలం ఉప ఎన్నిక వస్తుంది, ఉమ్మడి జిల్లా క్యాడర్ భద్రాచలం వెళ్లి గెలిపించుకుందాం. 50 ఏళ్లు మోసపోయాం, మళ్ళీ మోసపోవద్దని కేసీఆర్ చెప్పారు కానీ.. తాత్కాలికంగా మోసపోయాం. పేదలకు అండగా నిలిచేది బీఆర్ఎస్ మాత్రమే అని కేటీఆర్ చెప్పుకొచ్చారు.

### అన్ని జిల్లా కేంద్రాల్లో విద్యుత్తు సామగ్రి స్టోర్లు

కేంద్రాలకే పరిమితమైన విద్యుత్తు సామగ్రి స్టోర్‌లు.. అన్ని జిల్లా కేంద్రాల్లోనూ ఏర్పాటు చేయాలని విద్యుత్తు సంస్థల అధికారులను ఆదేశించారు. తెలంగాణ పలు అంతర్జాతీయ సంస్థలకు ప్రముఖ గమ్యస్థానంగా మారిందన్నారు. టెక్నాలజీ, ఆర్థిక సేవలు, ఫార్మా, తయారీ సంస్థలు తమ కార్యకలాపాలను విస్తరిస్తున్నాయన్నారు. గతేడాదితో పోల్చితే విద్యుత్తు డిమాండ్ దాదాపు 10 శాతం పెరిగినా సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉద్యోగులు కృషి చేస్తున్నారని కొనియాడారు. రానున్న ఐదేళ్ల కాలానికి విద్యుత్తు డిమాండ్ అంచనాలు, విద్యుదుత్పత్తి, పంపిణీ సంస్థలు తీసుకోనున్న కార్యక్రమాలు, చర్యలపై కార్యాచరణ నివేదికలు సిద్ధం చేయాలని ఇప్పటికే ఆదేశించారు. శుక్రవారమిక్కడ సచివాలయంలో ఆయా సంస్థల కార్యాచరణ ప్రణాళికలపై విద్యుత్తుశాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియాతో కలిసి సంబంధిత విద్యుత్తు సంస్థల ఉన్నతాధికారులతో భట్టి సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణభాస్కర్, టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫారూఖీ, టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి, రెడ్కో సీఎండీ అనిల పాల్గొని ఆయా సంస్థల కార్యాచరణ వివరాలు వెల్లడించారు. ఆయా విభాగాల ఉన్నతాధికారులు ఏమన్నారంటే..

**ట్రాన్స్‌కో:** 2024తో పోల్చితే గరిష్ఠ విద్యుత్తు డిమాండ్ 9.8% పెరిగింది. ఈ ఏడాదికి డిమాండ్ 16,877 మెగావాట్లకు చేరుతుందని అంచనా. కానీ వాస్తవ డిమాండ్ 17,162 మెగావాట్లుగా రికార్డయింది. ప్రస్తుతమున్న 389 ఈహెచ్‌టీ సబ్‌స్టేషన్లను 2030 నాటికి మరో 122 నిర్మించి 511కు పెంచేందుకు చర్యలు చేపట్టనున్నాం.

**టీజీఎస్‌పీడీసీఎల్:** సంస్థ పరిధిలో గతేడాది 9,862 మెగావాట్ల డిమాండ్ 10.48% పెరిగి 11,017 మెగావాట్లకు చేరింది. సైబర్‌సిటీ సర్కిల్ పరిధిలో గరిష్ఠ విద్యుత్తు డిమాండ్ గతేడాదితో పోల్చితే 33.69% పెరిగింది. విద్యుత్తు వినియోగాన్ని బట్టి ఆయా ప్రాంతాలను 4 కేటగిరీలుగా విభజించాం. కొత్తగా 5330 ఎంవీఏ కెపాసిటీ కలిగిన 410 33/11 కేవీ సబ్‌స్టేషన్ల నిర్మాణానికి ఏర్పాట్లు చేశాం.

### అర్హులైన జర్నలిస్టులకు త్వరలో ఇందిరమ్మ ఇళ్లు

కుటుంబాలకు నెలవారీ పెన్షన్‌బీ అనారోగ్యం, ప్రమాదాలకు గురై అచేతన స్థితిలో ఉన్న వారికి మంత్రి శుక్రవారం హైదరాబాద్ నాంపల్లిలోని మీడియా అకాడమీ కార్యాలయంలో ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన తెలంగాణ మీడియా అకాడమీ భవనానికి మరమ్మతులు పూర్తిచేసి ఈ నెలాఖర్లోగా ప్రారంభిస్తామని చెప్పారు. జర్నలిస్టుల సంక్షేమానికి విడతల వారీగా రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.42 కోట్లను ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి దానిపై వచ్చే వడ్డీని వారి సంక్షేమానికి అకాడమీ ఖర్చుపెడుతుందన్నారు. మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు చెందిన 597 మందికి రూ.1 లక్ష ఆర్థిక సహాయంతోపాటు 5 ఏళ్ల వరకూ నెలకు రూ.3వేల చొప్పున పెన్షన్ అందజేస్తున్నామని చెప్పారు. వారి పిల్లలకు ట్యూషన్ ఫీజుల కింద 1 నుంచి 10వ వరకు చదివే వారికి నెలకు రూ.1000 చొప్పున గరిష్ఠంగా ఇద్దరికి అందిస్తున్నామన్నారు. మీడియా అకాడమీ ఛైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమానికి నిధులు పెంచాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, పలువురు పాత్రికేయులు తదితరులు పాల్గొన్నారు.

### అగ్నివీరుడా వందనం..

కష్టపడి ఆర్మీలో చేరారు. కొద్దిరోజులుగా జమ్మూ కశ్మీర్ సరిహద్దులో సేవలు అందిస్తూ గురువారం అర్ధరాత్రి పాక్‌తో జరిగిన ఎదురు కాల్పుల్లో అమరుడయ్యారు. మురళి స్వస్థలం శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలం కల్లితండా. తండ్రి శ్రీరాంనాయక్, తల్లి జ్యోతిబాయి. మురళికి చిన్నతనం నుంచి దేశభక్తి ఎక్కువని.. అందుకే రైల్వేలో వచ్చిన ఉద్యోగాన్ని కూడా వదిలి ఆర్మీలో చేరారని గ్రామస్థులు, బంధువులు తెలిపారు. 2022 డిసెంబరులో గుంటూరులో జరిగిన ఎంపిక ప్రక్రియలో అగ్నివీర్‌గా సెలెక్ట్ అయ్యారు. తొలుత పంజాబ్, అస్సాంలలో పనిచేసినట్లు తండ్రి శ్రీరాంనాయక్ చెప్పారు రెండున్నరేళ్ల సర్వీసు పూర్తికావడంతో మరో ఏడాదిన్నరలో అగ్రిమెంట్ పూర్తి చేసుకుని వస్తాడని కలలుకంటున్న తల్లిదండ్రులు.. మురళి వీరమరణం గురించి తెలిసి దుఃఖసాగరంలో మునిగిపోయారు. తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి.

**ఏకైక సంతానం..**

మురళి తల్లిదండ్రులు తమ ఏకైక కుమారుడిని ఉన్నత స్థాయిలో చూడాలని ఆశించారు. ఇందుకోసం ఎన్ని కష్టాలకైనా సిద్ధమై పనుల కోసం ముంబయికి వెళ్లారు. అక్కడ తండ్రి భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తుండగా, తల్లి ఇళ్లలో పనులు చేస్తున్నారు. మురళిని నాగినాయని చెరువు తండాలో అమ్మమ్మ దగ్గర ఉంచి చదివించారు. మురళి పదో తరగతి వరకు సోమందేపల్లిలో, ఇంటర్మీడియట్, డిగ్రీ అనంతపురంలో పూర్తి చేశారు. శ్రీరాంనాయక్, జ్యోతిబాయి దంపతులు తండాలో మంగళవారం జరిగిన జాతరలో పాల్గొనడానికి ముంబయి నుంచి వచ్చారు. బంధువులు, సన్నిహితులతో ఆనందంగా గడిపారు. అంతలోనే ఈ దుర్వార్త వినాల్సి వచ్చిందని రోదిస్తున్నారు. 'పంజాబ్‌లో పని చేస్తున్నట్లు చెప్పాడే తప్ప జమ్మూ కశ్మీర్‌లో డ్యూటీ అని మాకు చెప్పనేలేదు' అని మురళి తండ్రి శ్రీరాంనాయక్ తెలిపారు. 'గురువారం ఉదయం మాతో వీడియో కాల్ మాట్లాడాడు. తాను బాగున్నానని చెప్పాడు. మేం ఎలా ఉన్నామని అడిగాడు. అంతలోనే ఈ దుర్వార్త వినాల్సి వచ్చింది' అంటూ బంధువులు ఆవేదన వ్యక్తంచేశారు.

## మొదటి పేజీ తరువాయి

### మాది టీ20 నమూనా

ద్వారా డ్రైపోర్టుకు శ్రీకారం చుడుతున్నాం. నెట్ జీరో సిటీగా ఫ్యూచర్ సిటీని నిర్మించనున్నాం. గుజరాత్ మోడల్‌కు కాలం చెల్లింది. అది నరేంద్రమోదీ మోడల్ వాట్సప్ యూనివర్సిటీ. అందులో ప్రచారానికే పెద్దపీట వేస్తారు. పనులు చేసి అభివృద్ధిని కళ్ల ముందు నిలపడమే మా మోడల్. కేంద్రం కూడా దీన్ని అనుసరించాల్సిందే. గత ప్రభుత్వాలు, ముఖ్యమంత్రులు తెలంగాణ అభివృద్ధికి తమవంతు కృషిచేశారు. ఇప్పుడు నా వంతుగా ప్రయత్నిస్తున్నా. తెలంగాణ ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వృద్ధిని సాధించాలన్నది మా ప్రభుత్వ లక్ష్యం.

**లోక్‌సభలో దక్షిణాది ప్రాతినిధ్యాన్ని తగ్గించాలని కుట్ర**

జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన చేస్తే తెలంగాణ సహా దక్షిణాది రాష్ట్రాలన్నీ తీవ్రంగా నష్టపోతాయి. ఇప్పుడున్న సీట్ల నిష్పత్తి ప్రాతిపదికన చేసినా మాకు నష్టమే. లోక్‌సభలో దక్షిణాది ప్రాతినిధ్యాన్ని కనిష్ఠానికి తగ్గించాలని కేంద్రం చూస్తోంది. ఒక వ్యక్తి, ఒక పార్టీ శాశ్వతంగా దేశాన్ని పాలించాలన్నది వారి ఆలోచన. దేశ ఆర్థిక వ్యవస్థకు ఏ రాష్ట్రమైతే ఊతమిస్తుందో... ఆ స్థాయిలో దానికి సీట్లను కేటాయించాలి. ఆ లెక్కన దక్షిణాదికి 33% సీట్లను ప్రత్యేకించాలి. అప్పుడే లోక్‌సభలో మా గళం వినిపిస్తుంది. కేసీఆర్ నేతృత్వంలోని భారాస పార్టీ కూడా ఇదే ఆలోచనతో చెన్నై సమావేశానికి హాజరైంది. ముందుగా అన్ని రాజకీయ పార్టీలను ఈ అంశంపై కేంద్రం చర్చకు పిలిచి, ఏ ప్రాతిపదికన నియోజకవర్గ పునర్విభజన చేస్తారనేది చర్చించాలి.

**సామాజిక దృక్కోణాన్ని ఆవిష్కరించే గణన**

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే... కులగణన చేపడతామని రాహుల్‌గాంధీ పాదయాత్ర సందర్భంగా హామీ ఇచ్చారు. అందుకే తెలంగాణలో కులగణన చేపట్టాం. నిజానికి మేం చేసింది... సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్య, ఉద్యోగ, కుల సర్వే. సామాజిక దృక్కోణాన్ని ఆవిష్కరించడానికి ఇది దోహదపడుతుంది. అగ్రవర్గాల్లోని పేదలకు ఈడబ్ల్యూఎస్ కోటా వర్తింపజేయడానికి సైతం ఉపయోగపడుతుంది. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన రోజే తెలంగాణలోనే తొలుత అమలు చేస్తామని అసెంబ్లీలో ప్రకటించాం. ఈ మేరకు కసరత్తు చేసి శాసనసభలో బిల్లును ఆమోదించాం. గ్రామీణం నుంచి వచ్చిన నాకు కులం ప్రభావం ఏమిటో బాగా తెలుసు. అందుకే అన్ని కులాలకు సమానమైన విద్యావకాశాలు కల్పించాలనే సంకల్పంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులందరికీ యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్లలో విద్యను అందించనున్నాం. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 25 ఎకరాల్లో రూ.250 కోట్ల వ్యయంతో ఒకటి నెలకొల్పనున్నాం. కేంద్ర ప్రభుత్వం ఈ తరహా విప్లవాత్మక చర్యలకు ముందుకు రావాలి. ప్రతి కుటుంబంలో ఒక వ్యాపారవేత్త, ఒక ఉద్యోగి వస్తే ఆ కుటుంబ స్థితిగతులు మారతాయనే ఆలోచనతో తెలంగాణలో అమలుచేస్తున్న పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయి.

# హైదరాబాద్ వేదికగా అతివల అందాల పోటీలు

మొదటి పేజీ తరువాయి




స్వాగతించారు. శనివారం కన్నుల పండువగా మిస్ వరల్డ్ 2025 ప్రారంభ ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలకు అనుగుణంగా మిస్ వరల్డ్ ఈవెంట్ లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. సంస్కృతి, సౌందర్యం రెండింటి మేళవింపుగా నిర్వహించనున్న మిస్ వరల్డ్ –2025 ఉత్సవాలను తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుంది. తెలంగాణాకు చెందిన వివిధ రకాల జానపద, గిరిజన, శాస్త్రీయ కళలు, హైదరాబాది దక్కని కళారూపాలను ఈ ఉత్సవాలలో సమ్మిళితం చేసి ప్రపంచ వ్యాప్తంగా తెలంగాణ ఖ్యాతిని, సాంస్కృతిక వైభవాన్ని చాటి చెప్పే ప్రయత్నం చేస్తున్నారు.ప్రపంచ దేశాల నుంచి హైదరాబాద్ నగరానికి విచ్చేసే సుందరీమణుల ఆహ్వానం కోసం రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టులో ఈనెల 3వ తారీఖు నుంచి 9వ తారీఖు వరకు కూచిపూడి, భరతనాట్యం, పేరిణి, కథక్, డప్పులు, బాజాభజంత్రీలు, మంగళ వాయిద్యాల తో కూడిన బృందాలతో స్వాగతం పలికేలా ఏర్పాటు– చేయడం జరిగింది. 24 గంటల పాటు అందుబాటు–లో ఉండి ఈ కళాకారులు ఎయిర్‌పోర్టులో ప్రపంచ సుందరి పోటీలకు విచ్చేస్తున్న సుందరీమణులకు స్వాగతం పలకడం జరిగింది. వారందరూ తెలంగాణ నేల మీద, హైదరాబాదులో కాలిడగానే కుంకుమ తిలకం దిద్ది, హారతులతో వారికి స్వాగతం పలకడం జరిగింది. నేడు గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో అత్యంత వైభవంగా జరుగుతున్న ప్రపంచ సుందరి ప్రారంభోత్సవ వేడుకలలో తెలంగాణ సంస్కృతి, కళలు ఆకట్టుకునేలా రూపొందించడం జరిగింది. వాటిలో మొదట తెలంగాణ రాష్ట్ర గీతం ఆలాపనతో ప్రారంభం అవుతాయి. కవి డాక్టర్ అందెశ్రీ రచించిన ఈ గీతానికి, ఆస్కార్ పురస్కార గ్రహీత ఎం.ఎం.కీరవాణి గారు సంగీతాన్ని సమకూర్చగా, ఈ పాటని ఈ ప్రపంచ సుందరి వేడుకలలో ప్రముఖ గాయకుడు, శిక్షకుడు కొమాండూరి రామాచారి శిష్య బృందం 50 మంది బృంద గీతంగా ఆలపిస్తారు. ఆ తర్వాత కాకతీయుల కాలం నుండి తెలంగాణ శాస్త్రీయ నృత్య రీతిగా ఖ్యాతి గడించిన పేరిణి నాట్య ప్రదర్శన అత్యంత వైభవంగా జరగనుంది. 250 మంది మహిళా కళాకారిణులు పేరిణి లాస్య సంప్రదాయాన్ని అనుసరించి ఈ నృత్యాన్ని ప్రదర్శించబోతున్నారు. దీనికి శ్రీ పేరిణి సందీప్ నృత్య దర్శకత్వం వహించగా, ప్రముఖ సంగీత నిపుణుడు ఫణి నారాయణ గారు స్వరాలు సమకూర్చడం జరిగింది. దాదాపు పది నిమిషాల పాటు– జరిగే ఈ పేరిణి నాట్యం లో సౌందర్యం, సంస్కృతి, స్త్రీల సాధికారత అంశాలు ప్రధానంగా ఉదహరించడం జరిగింది. దాంతోపాటు–కళాకారులు అందరూ కలిసి నక్షత్రం ఆకారం లో, సీతాకోకచిలుక ఆకారాన్ని, అలాగే మిస్ వరల్డ్ లోగో ఆకృతిని కూడా తమ విన్యాసాల లో భాగంగా ప్రదర్శిస్తారు. ఆ తర్వాత ప్రపంచ దేశాల నుంచి విచ్చేసిన సుందరీమణుల పరిచయ కార్యక్రమానికి ప్రారంభ సూచికగా, ఖండాల వారీగా తెలంగాణ జానపద, గిరిజన కళారూపాల ప్రదర్శనలతో ప్రారంభమవుతాయి. వాటిలో భద్రాచలం గోదావరి పరివాహక ప్రాంతానికి పట్టు–గొమ్మగా నిలిచిన కొమ్ము కోయ కళాకారులు శ్రీ రామకృష్ణ బృందం ప్రదర్శన ఉంటు–ంది. ఆ తర్వాత ఆదిలాబాద్ ప్రాంతం నుంచి గోండు జాతి ప్రజల విశిష్ట కళారూపం గుస్సాడీ కళా ప్రదర్శన శ్రీ కత్లే శ్రీధర్ బృందంతో మరొక ఖండానికి సంబంధించిన సుందరీమణులు వేదిక కి పరిచయం అవుతారు. అలాగే తెలంగాణ జానపద సంప్రదాయానికి నిలువెత్తు నిర్వచనంగా నిలిచే డప్పులు ఉస్తాద్ బిస్మిల్లాఖాన్ యువ పురస్కార గ్రహీత శ్రీ అందే భాస్కర్ బృందంతో, తెలంగాణ గిరిజన వైభవానికి ప్రతీకగా నిలిచే బంజారా మహిళల విన్యాసాలు శ్రీమతి స్వప్న బృందంతో ప్రదర్శనకి వస్తాయి. ఆ తర్వాత తెలంగాణ గ్రామీణ పల్లె జీవన ప్రతీకగా నిలిచిన ఒగ్గుడోలు కళా విన్యాసాలు ఉస్తాద్ బిస్మిల్లాఖాన్ యువ పురస్కార గ్రహీత శ్రీ చౌదరపల్లి రవి కుమార్ బృందంచే ప్రదర్శితమవుతోంది. ఈ కళారూపాలు అన్నింటి మేళవింపుగా ముగింపు ఉంటుంది. ఇలా సౌందర్యం, సంస్కృతి రెండు కలగలిసిన వేడుకగా ఈ ప్రారంభోత్సవ సంబరాలు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించింది.



## వరద ముంపు సమస్య  శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు : కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్

శేరిలింగంపల్లి వార్త మిర్రర్ : శేరిలింగంపల్లి డివిజన్ అభివృద్ధిలో ఎలాంటి ఆటంకాలు లేకుండా ముందుకు పోతున్నామని శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ అన్నారు. నల్లగండ్ల చెరువు నుండి బిహెచ్ఇఎల్ చౌరస్తా ఇండియన్ గ్యాస్ గోడౌన్ నాలా వరకు ఎస్. ఎన్. డి. పి అండర్ హై సిటీ లో భాగంగా రూ. 28 కోట్లు 45 లక్షల రూపాయల వ్యయంతో నూతనంగా చేపడుతున్న ఓపెన్ డ్రైన్ ఆర్ సి సి బెడ్, సైడ్ వాల్స్ నిర్మాణం పనులను సంబంధిత జిహెచ్ఎంసీ అధికారులతో కలిసి శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. నాలాల విస్తరణ పనులతో లోతట్టు ముంపు ప్రాంతాలకు శాశ్వత ఉపశమనం అని పేర్కొన్నారు. ఆర్ సి సి బాక్స్ డ్రైన్ పనులు నాణ్యతతో నిర్మించాలని అధికారులను ఆదేశించారు. పనుల్లో జాప్యం జరగకుండా స్థానికవాసులకు ఇబ్బంది కలగకుండా రాబోయే వర్షాకాలంలోపు పరిసర ప్రాంతవాసులకు అందుబాటులోకి తీసుకువచ్చేలా కృషి చేస్తున్నామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారులు అసిస్టెంట్ సిటీ ప్లానర్ వెంకట్ రమణ, డిప్యూటీ సిటీ ప్లానర్ తులసిరామ్, ఎస్ఎన్డిపి జిహెచ్ఎంసీ డిఈ దీరజ్, ఎఈ యుగేందర్, టీపిఎస్ జీషన్ కొయ్యాడ లక్ష్మణ్ యాదవ్, సుభాష్, సాయి, రమేష్, శశి, హరీష్ స్థానికవాసులు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా తెలంగాణ ఉద్యమ నాయకుడు కొండకల్ శంకర్ గౌడ్ 56వ జయంతి వేడుకలు

శేరిలింగంపల్లి వార్త మిర్రర్ : శంకర్ గౌడ్ 56 వ జయంతి సందర్భంగా గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్ సాయిబాబా మాట్లాడుతూ మా రాజకీయ గురువర్యులు తెలంగాణ మలి దశ ఉద్యమ కారులు కీ శే : కొండకల్ శంకర్ గౌడ్ 56వ జయంతి సందర్భంగా నేడు శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం నందు శంకర్ గౌడ్ చిత్రపటానికి ఘన నివాళులు అర్పించడం జరిగింది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో చెన్నం రాజు, అంజమ్మ, దారుగుపల్లి నరేష్,పెద్దగోని రమేష్ గౌడ్,ఆకుల యాదగిరి, బురాన్, బాలమణి, మాధవి, సుగుణ తదితరులు పాల్గొనడం జరిగింది.



## ఉపనయన కార్యక్రమంలో పాల్గొన్న బండి రమేష్.

శేరిలింగంపల్లి వార్త మిర్రర్ : మియాపూర్ లో ఉపనయన శుభ కార్యక్రమంలో పాల్గొన్న బండి రమేశ్, యలమంచి ఉదయ్ కిరణ్ టీం సభ్యులు శుక్రవారం రోజు కుకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ , యలమంచి ఉదయ్ కిరణ్ మరియు బృందం, మియాపూర్ లోని ఎస్.ఆర్. ఎస్టేట్స్‌లో నిర్వహించిన శరత్ బాబు, హరీష ల కుమారుడు సాయి అనుశిత్ యొక్క ఉపనయన కార్యక్రమం లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి రమేష్ తో పాటు గా పెద్దలు సాయి అనుశిత్ ని ఆశీర్వదించారు, ఈ కార్యక్రమంలో శరత్ బాబు కుటుంబ సభ్యులతో పాటు పలువురు పుర ప్రముఖులు, మియాపూర్ డివిజన్ నాయకులు పాల్గొన్నారు.



## కొండకల్ శంకర్ గౌడ్ 56వ జయంతి వేడుకలు

శేరిలింగంపల్లి వార్త మిర్రర్ : శేరిలింగంపల్లి మసీద్ బండ, తెలంగాణ సాధనకోసం ప్రాణాలర్పించిన మన రాజకీయ గురువు, తెలంగాణ యోధుడు కొండకల్ శంకర్ గౌడ్ 56వ జయంతి సందర్భంగా శేరిలింగంపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా స్మారక కార్యక్రమాలు నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శంకర్ గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి వందనాలు అర్పించారు. జీహెచ్ఎంసి కార్మికులకు పండ్లు పంపిణీ చేసి గౌరవించారు తెలంగాణ సాధనలో శంకర్ గౌడ్ త్యాగాలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా మారబోయిన రవి యాదవ్ మాట్లాడుతూ..శంకర్ గౌడ్ తెలంగాణ కోసం చేసిన త్యాగాలు మన తరాల వారికి ప్రేరణ శేరిలింగంపల్లి అభివృద్ధికి అతను చేసిన కృషిని మరువలేము. ఈ రోజు మన కర్తవ్యం అతని స్వప్నాలను నిజం చేయడమే అన్నారు . ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు కే ఎన్ రాములు, కొండగల్ శ్రీనివాస్ గౌడ్, గంగాధర్ గౌడ్, డాక్టర్ రవికుమార్, స్వామినాథ్, ప్రభాకర్ గౌడ్, గడ్డం శ్రీనివాస్, శ్రీకాంత్ యాదవ్, సురేష్ యాదవ్, శ్రీశైలం యాదవ్ పాల్గొన్నారు.

# తెలంగాణ సాయుధ పోరాట యోధుడు భీమిరెడ్డి వర్ధంతి

మిర్యాలగూడ మే 9:- (వార్త మిర్రర్) తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు, మిర్యాలగూడ మాజీ ఎంపి, పొలిట్ బ్యూరో సభ్యులు భీమిరెడ్డి నరసింహారెడ్డి 17వ వర్ధంతి సభ దిరావత్ మోహన్ నాయక్ అధ్యక్షతన రామచంద్రగూడెం వై జంక్షన్ భీమిరెడ్డి నరసింహారెడ్డి విగ్రహం దగ్గర నిర్వహించడం జరిగింద ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వస్కుల మట్టయ్య, జిల్లా కార్యదర్శి వస్కుల సైదమ్మ, జిల్లా సహాయ కార్యదర్శి పోతుగంటి కాశి మాట్లాడుతూ భీమిరెడ్డి నరసింహారెడ్డి భూమి, భుక్తి, పీడిత ప్రజల విముక్తి కోసం జరిగిన మహత్తర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ఆయుధం చేత పట్టుకుని ఉద్యమాన్ని నడిపిన నాయకులలో బిఎన్ ఒకరన్నారు. బిన్ పేరు వినగానే రైతాంగ సాయుధ పోరాటాల స్మృతులు ఉప్పెనల ఎగిసిపడతాయన్నారు. నేటి సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం కరివిరాల కొత్తగూడెంలో భూస్వామ్య కుటుంబంలో పుట్టి ఆయన రైతాంగ ఉద్యమం వైపు ఆకర్షితుడైనరన్నారు. సాయుధ పోరాటం సందర్భంగా 3,000 గ్రామాలలో గ్రామ రాజ్యాలు ఏర్పాటు చేసి పది లక్షల ఎకరాల భూమిని ఎర్రజెండా నాయకత్వంలో పంచినారన్నారు. కమ్యూనిస్టు పార్టీ స్ఫూర్తితో ఎర్రజెండా నీడన గ్రామాలలో గ్రామ రక్ష దళాలు ఏర్పాటు చేసి శత్రువు మూకలను ఎదిరించిన నాయకుడు బిఎన్ అని అన్నారు. 1947 స్వాతంత్రం వచ్చిన తర్వాత నిజాం సైన్యాలతో అటు యూనియన్ సైన్యాలతో తలపడవలసి వచ్చిందన్నారు సాయుధ దళాలను మైదాన ప్రాంతాల నుండి అడవి ప్రాంతాలకు మలిపి గోదావరి పరివాహక ప్రాంతంలో నది రెండు వైపులా సుమారు 200 గ్రామాలలో ఉద్యమాన్ని




విస్తరింపజేసిన బిఎన్ అని అన్నారు. మిర్యాలగూడ పార్లమెంటు సభ్యుడిగా ఉన్న సమయంలో కేంద్ర ప్రభుత్వంతో కొట్లాడి బీబీనగర్- నడికుడి రైలు మార్గాన్ని ఏర్పాటు చేయించిన ఘనత బీఎన్ కె ఉన్నదన్నారు ప్రజల హక్కులపై సమస్యలపై చట్టసభలలో తన గళాన్ని వినిపించిన గొప్ప నాయకుడు భీమిరెడ్డి నరసింహారెడ్డి అన్నారు. బిఎన్ ఆశయ సాధన కోసం తెలంగాణ ప్రజలంతా ఎర్రజెండా పట్టుకొని ముందుకు నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భరత్, లాలునాయక్, మల్లేష్, రవీందర్, మౌనిక, ఉప్పలమ్మ, గురవయ్య, కమలమ్మ, సైదా నాయక్, జ్యోతి, యాదమ్మ, శారద, నాగరాజు పాల్గొన్నారు

# సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డి ఇంట్లో పోలీసుల దాడులను ఖండిస్తూ జర్నలిస్టుల నిరసన

మిర్యాలగూడ మే 9:-( వార్త మిర్రర్) సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనుంజయరెడ్డి ఇంట్లో పోలీసుల దాడులను ఖండిస్తూ మిర్యాలగూడ పట్టణంలో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ వద్ద బిఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద మిర్యాలగూడ జర్నలిస్టు సంఘాల ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జిలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం సబ్ కలెక్టరేట్ పరిపాలన అధికారి శ్రీనివాస్ శర్మకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పలువురు సీనియర్ జర్నలిస్టులు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాలకు ప్రజలకు మధ్య వారధిగా పనిచేసే మీడియా పట్ల కక్ష సాధింపు ధోరణితో వ్యవహరించటం అప్రజా స్వామికమన్నారు. ఎటువంటి సమాచారం ఇవ్వకుండా విజయవాడలోని సాక్షి పత్రిక ఎడిటర్ ధనుంజయరెడ్డి ఇంట్లో పోలీసులు తనిఖీలు జరపటం. కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురి చేయటం పత్రిక స్వేచ్ఛపై జరిగిన దాడి అని ఆరోపించారు. పత్రికల్లో వచ్చే వార్తల పట్ల ప్రభుత్వాలు స్పందించాలి సమస్య ఏదైనా ఉంటే సరి చేయాలి అంతేకానీ తమకు వ్యతిరేకంగా కథనాలు రాస్తారా అంటూ కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం అత్యంత హేయమైన చర్య అన్నారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు ఖాజా హామీదుద్దీన్, నామిరెడ్డి నరేందర్రెడ్డి, ఎండి.అస్లాం, ఎండి.అయ్యుబ్, ఖాజా నాజీముద్దీన్, రంగా శ్రీనివాస్, బొంగరాల మట్టయ్య, బాలా జీరావు, భాస్కర్, జంగా లక్ష్మన్ యాదవ్, రామకృష్ణ, పుప్పాల యాదగిరి, రాచకోండ రమేష్, కాతోజు నాగాచారి. రాజారామ్, హరీష్. సునీల్, బంటు శేఖర్. కట్టబాబు, కందుల వెంకటేశ్వర్లు, పార్దు, నాగభూషణం, పేర్ల వెంకన్న, అశోక్, శివ కృష్ణ, మాణిక్యం, దైద రవి, మంద సైదులు, ఎంసీపీఐయూ జిల్లా





సహాయ కార్యదర్శి పోతుగంటి కాశి, సీపీఐఎం నాయకులు అంజాద్, తిరందాసు విష్ణు వున్నారు



## సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలు అరికట్టవచ్చు: - ఎస్సై మాధవరెడ్డి

కల్వకుర్తి మే 9 వార్త మిర్రర్ ప్రతినిధి :- కల్వకుర్తి మండల పరిధిలోనీ యంగంపల్లి గ్రామాలలో సీసీ కెమెరాలు ఏర్పాటుకు కుడుముల శ్రీనివాస్ రెడ్డి,లంకల ప్రశాంత్ రెడ్డి ఇరువురు రూ "1.50 లక్షల సహకారంతో 13 సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో కల్వకుర్తి ఎస్సై మాధవరెడ్డి పాల్గొని గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసుల తో సమానమని, సీసీ కెమెరాల వల్ల భద్రత ప్రమాణాలు మెరుగుపడతాయని తెలిపారు. అలాగే రోడ్డు ప్రమాదాలు, దొంగతనాల నివారణకు రోడ్డు ప్రమాదాల్లో వాహనాలను గుర్తించేందుకు సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. గ్రామంలోని ప్రధాన రహదారులు బస్టాండ్ చౌరస్తాలో ఏర్పాటు చేస్తే నేరాలను అరికట్టవచ్చని తెలిపారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు గ్రామ దాతలు సహకరించారని ప్రతి గ్రామంలో ఇదే విధంగా సహకరించి గ్రామాలలో దోపిడీలను నివారించవచ్చని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామం మాజీ సర్పంచ్ ఎగిరి సత్యం, మాజీ ఉప సర్పంచ్ రామ స్వామి, కిరణ్, జాంగిర్, గుర్రాల రాజు, కిషోర్ రెడ్డి, రవి, రామోజీ, అల్లూరి చెన్నయ్య, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



## తీన్మార్ మల్లన్నకు మద్దతుగా శేరిలింగంపల్లి బీసీ సంఘం.. అధ్యక్షులు,అడ్వకేట్ బండారి రమేష్ యాదవ్ బృందం

శేరిలింగంపల్లి వార్త మిర్రర్ : బీసీలకు మద్దతుగా తీన్మార్ మల్లన్న చేస్తున్న పోరాటంకు ఆకర్షితులై శేరిలింగంపల్లి బీసీ సంఘం అధ్యక్షులు, అడ్వకేట్ రమేష్ యాదవ్ బృందంతో మర్యాద పూర్వకంగా కలిసిన బీసీ సంఘము అసోసియేషన్ సభ్యులు, తీన్మార్ మల్లన్న, రాష్ట్ర కో కన్వీనర్ నరసయ్య గౌడ్ తో సమావేశమై చర్చించడం జరిగింది. బీసీల ఉద్యమం ఎలా ముందుకు తీసుకెళ్దామని సమాలోచన చేశాం. శేరిలింగంపల్లిలో ఒక వేయి మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలతో ఒక సమావేశం ఏర్పాటు చేస్తాము అని తీన్మార్ మల్లన్న నరసయ్య గౌడ్ తో తెలియజేశాము. ఈ సందర్భంగా తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ..బీసీలకు మద్దతుగా, అండగా బీసీల రాజ్యం స్థాపించే వరకు నిద్రపోను అని, బీసీ లందరూ ఏకంగా ఐక్యం కావాలని బీసీల బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తానని, బిసిల ఏకం చేయడానికి ఎంతవరకైనా మేము సిద్ధమని, దామాషా ప్రకారం బీసీలకు న్యాయం జరిగే వరకూ ఉద్యమం ఆపమని అన్నారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి బీసీ సంఘం అధ్యక్షులు, అడ్వకేట్ బండారి రమేష్ యాదవ్ తో పాటు బిసి సంఘం ప్రధాన కార్యదర్శి బి. కృష్ణ, ఉపాధ్యక్షులు నర్సింగ్ ముదిరాజ్, కన్వీనర్ మాధవరావు, మైనారిటీ అధ్యక్షులు ఎండి మక్బుల్, మహిళా అధ్యక్షురాలు అనిత, జాయింట్ సెక్రటరీ రాజు, తదితరులు పాల్గొన్నారు.

## భారత సైన్యం పోరాడే తీరు ఒక భారతీయుడుగా నేను గర్వపడుతున్నా

### మునుగోడు నియోజకవర్గ మైనార్టీ నాయకులు ఎండి రహీం షరీఫ్

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి



ఉగ్రవాదం మరియు ఉన్మాదం ఏరూపంలో వున్నా,ఏ దేశంలో వున్నా,ప్రపంచ మానవాళికి నష్టం కలిగించేదే తప్ప లాభం చేకూర్చేదికాదు అని అన్నారు ఎండి రహీం షరీఫ్ ఉగ్రవాదం అంతం కావాల్సిందే. ఈ విషయంలో పాజిటివ్ గా ఆలోచించే ప్రపంచ శక్తులన్నీ ఏకమై, ఉగ్రవాదాన్ని అంతమొందిస్తేనే శాంతి సామరస్యాలు నెలకొంటాయి. హింసను వాళ్లు ప్రారం భించారు మనం ముగించాలని అన్నారు. దేశ భద్రతకు ఇది కీలకమైన దశ.ఈ సమయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి. సోషల్ మీడియాలో పుకార్లను నమ్మకండి, అవి పంచకండి.ప్రాంతీయ పోలీసులకు, శాంతి భద్రతల శాఖలకి పూర్తి సహకారం ఇవ్వండి. అనుమానాస్పద విషయాలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వండి.మన దేశ రక్షణ కోసం పోరాడుతున్న సైనికులకు మద్దతుగా నిలుద్దాం. మన సమాజంలో శాంతి, భద్రత కాపాడేందుకు ప్రతి ఒక్కరం బాధ్యత వహిద్దాం.





## ముగిసిన వీర్లపాలెం రామాలయం ద్వితీయ పుష్కర బ్రహ్మోత్సవాలు - మహా అన్నదాన కార్యక్రమం

మిర్యాలగూడ (దామరచర్ల) , మే 9:- దామరచర్ల మండలంలోని వీర్లపాలెం గ్రామంలో వేంచేసియున్న శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న ద్వితీయ పుష్కర బ్రహ్మోత్సవాలు బుధవారం విజయవంతంగా ముగిశాయి. వేలాదిగా తరలివచ్చిన భక్తులకు మహా అన్నదాన ప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ నెల మూడు నుండి ప్రారంభమైన బ్రహ్మోత్సవాలలో చివరి రోజున మహా పూర్ణాహుతి, ఆలయ రాజ గోపురముల మహా కుంభ సంప్రోక్షణ, సత్తా వర్ణ ప్రదక్షణ మంగళ శాసనాల కార్యక్రమాన్ని పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం సాయంత్రం వేళ మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ పూజారులు అలహరి శేషాచార్యులు, రాఘవాచార్యులు, పవన్ కుమారాచార్యులు, రఘునాథచార్యులు, మాజీ సర్పంచులు చల్లా అంజిరెడ్డి, ఆంగోతు పర్శ్యానాయక్, నేనావత్ కోట నాయక్, సింగిల్ విండో చైర్మన్ దుర్గంపూడి నారాయణరెడ్డి, నాగనాయక్, పాతులోతు బాలు నాయక్, మల్ రెడ్డి కోటిరెడ్డి, రమావత్ శ్రీను నాయక్, లిఫ్ట్ చైర్మన్ మామిడి వెంకన్న యాదవ్, మామిడి మల్లయ్య యాదవ్, గడ్డం నాగరాజు యాదవ్, కేశబోయిన నాగరాజు, కొమ్ము మహేష్, నన్నేబోయిన బాలయ్య, యాతం మహేష్ పాల్గొన్నారు.



## ఉషశ్రీ- శ్రీకాంత్ వివాహంలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన

### మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి సంస్థాన్ నారాయణపూర్ మండల కేంద్రంలో శ్రీ వెంకటేశ్వర గార్డెన్స్ లో ఈసీ విద్య సాగర్ ఆదర్శ పాఠశాల కరస్పాండెంట్ కట్ల భాస్కరాచారి -వనజ కుమార్తె ఉషాశ్రీ- శ్రీకాంత్ వివాహం వివాహ వేడుకలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే కర్నె ప్రభాకర్, ప్రాచీన శివాలయ కమిటీ అధ్యక్షులు పాలకూర్ల సతీష్ గౌడ్, రాచకొండ శ్రీనివాస్ చారి, వీరమల్ల ఓంకార్ గుప్తా, ఇరుకుల్ల ప్రేమ్ చందర్ గుప్తా, రాచకొండ రవీంద్రచారి, ఉప్పల శ్రీను ,తెలంగాణ బిక్షం, చిలువేరు సైదులు, తదితరులు వివాహ మహోత్సవంలో పాల్గొన్నారు



## బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీధర్ కు భగీరథ జ్ఞాపికను అందజేసిన

### ఉప్పరి శేఖర్ సగర- గౌరెక్క సత్యం సగర

హైదరాబాద్ వార్త మిర్రర్ ప్రతినిధి

బిసి సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీధర్ ని సెక్రటేరియట్ లోని ఆయన ఛాంబర్ లో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శ్రీ సగర భగీరథ జయంతి రాష్ట్రస్థాయి ఉత్సవాల జ్ఞాపికను అందజేసిన తెలంగాణ సగర సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఉప్పరి శేఖర్ సగర, ప్రధాన కార్యదర్శి గౌరక్క సత్యం సగర సగరులకు అందాల్సిన బీసీ సంక్షేమ పథకాల పై పలు అంశాలపై చర్చించారు



## ఉషశ్రీ- శ్రీకాంత్ వివాహంలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన

### ఈ సి విద్యాసాగర్ ఆదర్శ పాఠశాల పూర్వ ఉపాధ్యాయులు

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి

సంస్థాన్ నారాయణపూర్ మండల కేంద్రంలో శ్రీ వెంకటేశ్వర గార్డెన్స్ లో ఈసీ విద్య సాగర్ ఆదర్శ పాఠశాల కరస్పాండెంట్ కట్ల భాస్కరాచారి -వనజ కుమార్తె ఉషాశ్రీ- శ్రీకాంత్ వివాహం వివాహ వేడుకలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన ఈసీ విద్యాసాగర్ ఆదర్శ పాఠశాల పూర్వ ఉపాధ్యాయులు కల్లెట్ల నర్సింగ్ సాగర్, మహమ్మద్ అజార్, అల్తాఫ్, వివాహానికి వచ్చిన ఉపాధ్యాయులతో, విద్యార్థిని విద్యార్థులతో, నాటి పాఠశాల జ్ఞాపకాలను గుర్తు చేసుకొని ఆనందం వ్యక్తం చేశారు. వివాహ మహోత్సవానికి కట్ల భాస్కరాచారి బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు




## సిబిఐ ఎస్ఐగా ఎంపికైన సన్నిధి సౌమ్యశ్రీ ని ఘనంగా సన్మానించిన వాసవి క్లబ్

మిర్యాలగూడ , మే 9:-( వార్త మిర్రర్)

సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సిబిఐ) ఎస్ఐ గా సన్నిధి సౌమ్యశ్రీ ఎంపీ కావడం హర్షించదగ్గ విషయమని, అత్యుత్తమ విజయానికి వాసవి క్లబ్ రీజియన్ -2 ప్రతినిధులు సౌమ్యశ్రీను శుక్రవారం మిర్యాలగూడ పట్టణంలోని రెడ్డి కాలనీలో డైమండ్స్ చెస్ అకాడమీలో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా సిబిఐ మహిళా అధికారిగా ఎంపికైన ఘనత సన్నిధి సౌమ్యశ్రీ దక్కిందని వారు పేర్కొన్నారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం జప్తి వీరప్పగూడెం గ్రామానికి చెందిన సన్నిధి కోటయ్య సునీత కుమార్తె సౌమ్యశ్రీ మిర్యాలగూడ ప్రాంతానికి పేరు తీసుకురావడం జరిగిందని అందరికీ గర్వకారణం అన్నారు. కార్యక్రమంలో సన్నిధి సౌమ్య తల్లిదండ్రులు సన్నిధి కోటయ్య, సునీత, సోదరుడు సన్నిధి సాయి చరణ్, వాసవి క్లబ్ ఐపిసి డైమండ్ మాశెట్టి శ్రీనివాస్, డిస్టిక్ ఇంచార్జ్ సామ శ్రీనివాస్, సంతోషి, జస్టిస్ అడ్వకేట్స్ క్లబ్ ప్రెసిడెంట్ సోమ దిలీప్, జస్టిస్ అడ్వకేట్స్ క్లబ్ మాజీ ప్రెసిడెంట్ మాశెట్టి దివ్యశ్రీ, కపుల్స్ క్లబ్ ట్రెజరర్ గుండా రవిగుప్తా, మాజీ ఆర్ఇసి మందాలపు శ్రీనివాస్, వాసవి క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## అమన్ జిమ్ ఫిట్నెస్ సెంటర్ 4 వ వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న

### బిఆర్ఎస్ నేత సామాజికవేత్త డాక్టర్ ర్యాకల శ్రీనివాస్







యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి

భువనగిరి పట్టణ కేంద్రంలో అమన్ జిమ్ ఫిట్నెస్ సెంటర్ 4వ వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న బిఆర్ఎస్ జిల్లా నాయకులు, సామాజికవేత్త, డాక్టర్ ర్యాకల శ్రీనివాస్, ఈ సందర్భంగా మాట్లాడుతూ నేటి యువత వ్యాయామం పట్ల జిమ్ ఫిట్నెస్ సెంటర్ల వైపు, చూడాలని తెలిపారు, నేటి సమాజంలో యువత, విద్యార్థులు బెట్టింగ్, డ్రగ్స్, మద్యం, ఇలాంటి చెడు వ్యసనాలకు దగ్గరవుతున్నారని, ఈ మహమ్మారి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలంటే, యువత, విద్యార్థులు ఫిట్నెస్ సెంటర్లకు వెళ్లాలని తెలిపారు. సమాజంలో మీరు సిక్స్ ప్యాక్ %శీ% నలుగురిలో మీరు హీరోలాగా కనపడతారని తెలిపారు. ఫిట్నెస్ మీ కండరాల బలాన్ని పెంచుతుంది మీరు ఎక్కువసేపు వ్యాయామం చేయగలగడానికి సహాయపడుతుంది. వ్యాధుల ప్రమాదం తగ్గుతుంది అన్నారు.ఫిట్‌నెస్ చేయడం ద్వారా టైప్ డయాబెటిస్, హృదయ సంబంధ వ్యాధులు మరియు కొన్ని రకాల క్యాన్సర్ల ప్రమాదాన్ని తగ్గించవచ్చు. బరువు నియంత్రణ:ఫిట్‌నెస్ ద్వారా మీ బరువును నియంత్రించవచ్చు మరియు ఊబకాయాన్ని నివారించవచ్చు. కణజాలాలకు ఆక్సిజన్ మరియు పోషకాలు:వ్యాయామం ద్వారా మీ కణజాలాలకు ఆక్సిజన్ మరియు పోషకాలు సమృద్ధిగా అందుతాయి, ఇది మీ ఆరోగ్యానికి మంచిది. మానసిక ప్రయోజనాలు:మానసిక స్థితి మెరుగుపడుతుంది:ఫిట్‌నెస్ మీ మానసిక స్థితిని మెరుగుపరుస్తుంది ఆందోళన, నిరాశ భావాలను తగ్గిస్తుంది. అని అన్నారు ఈ కార్యక్రమంలో అమన్ జిమ్ ఫిట్నెస్ సెంటర్ నిర్వాహకులు తదితరులు అమన్ జిమ్ ఫిట్నెస్ సెంటర్ 4 వ వార్షికోత్సవంలో పాల్గొన్నారు

## దామరచర్ల విజయశ్రీ జ్యువెల్లర్స్ ను కొల్లగొట్టిన దొంగలు

### సుమారు 27తులాల బంగారు నగలు అపహరణ







మిర్యాలగూడ, మే 9 :-( వార్త మిర్రర్)

నల్గొండ జిల్లా దామరచర్ల మండల కేంద్రంలో దొంగలు రెచ్చిపోయారు.నార్కట్ పల్లి - అద్దంకి స్టేట్ రహదారిపై గ్రామం లోని ప్రధాన కూడలిలో నిత్యం రద్దీ గా ఉండే విజయశ్రీ జ్యువెల్లర్స్ లో గురువారం రాత్రి గుర్తుతెలియని దుండగులు షాపు షట్టర్ ధ్వంసం చేసి 27 తులాల బంగారు నగలు ఎత్తుకెళ్ళినట్లు షాప్ యజమాని కాలే బ్రహ్మయ్య స్థానిక వాడపల్లి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై బాధితులు మాట్లాడుతూ గ్రామంలో ఈనెల 11న జాతర మహోత్సవాలు ఉన్నాయి, దీనికి తోడు పెళ్ళిల్ల సీజన్ కావడంతో పెద్ద ఎత్తున నగలు తయారు చేసేందుకు ఆర్డర్స్ వచ్చాయని అన్నారు. ఈ నేపథ్యంలో యధావిధిగా రాత్రి 9:30 గంటల సమయంలో షాపు మూసివేసి ఇంటికి వెళ్లినట్లు తెలిపారు. కాగా గుర్తు తెలియని దుండగులు మొదటగా షాపు వెనుక వైపు ఉన్న వెంటిలేటర్ పగలగొట్టారని కానీ మధ్యలో తలుపు ఉండటంతో అటు నుంచి లోనికి ప్రవేశించటం కష్టంగా భావించి ఇనుప రాడ్ ఉపయోగించి ముందువైపు షట్టర్ ను ఒకవైపు ధ్వంసం చేసి లోనికి ప్రవేశించిన దుండగులు మూడు బాక్స్ లలో ఉన్న 27 తులాల బంగారు నగలను ఎత్తుకెళ్లిపోయినట్లు తెలిపారు. షాప్ లో సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ, దొంగలు తెలివిగా హార్డ్ డిస్క్ ను సైతం అపహరించకపోయినట్లు తెలిపారు. తెల్లవారుజామున మూడున్నర సమయంలో సీసీ కెమెరాల సిగ్నల్ సెల్ కు అందకపోవటంతో అనుమానం వచ్చి షాపు వద్ద పరిశీలించగా దొంగతనం జరిగినట్లు గ్రహించినట్లు తెలిపారు. ఈ విషయంపై వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేరుకొన్న రూరల్ సిఐ పిఎన్డి ప్రసాద్, వాడపల్లి ఎస్సై శ్రీకాంత్ రెడ్డిలు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. విషయాన్ని ఉన్నతాధికారులకు చేరవేయడంతో నల్లగొండ నుండి క్లూస్ టీం వచ్చి ఆదారాలు సేకరించారు. అనంతరం మిర్యాలగూడ డిఎస్పి కె.రాజశేఖర్ రాజు చోరీ జరిగిన విజయశ్రీ జ్యువెలర్స్ ను పరిశీలించారు. సిసి పుటేజీ దొరకుండా హార్డ్ డిస్క్ ఎత్తుకెల్లడంపై ఇది అనుభవజ్ఞులైన పాత నేరస్తుల పనిగా పోలీసులు ప్రాథమిక అంచనా వేస్తున్నారు. ఆధారాల కోసం సమీపంలోని షాపుల సిసి పుటేజీ పరిశీలించి వివరాలు సేకరిస్తున్నట్లు మిర్యాలగూడ రూరల్ సిఐ పిఎన్ డి ప్రసాద్ తెలిపారు. సంఘటనపై షాప్ యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వాడపల్లి ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. దామరచర్ల లో ప్రధాన రహదారిపై రద్దీగా ఉండే బంగారం షాపులోనే దొంగతనం జరగటంపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొద్దిరోజుల క్రితం ఇదే రహదారి పక్కనున్న ఏటీఎంను దొంగలు కొల్లగొట్టి దాదాపు 27లక్షలు ఎత్తుకెల్లిన విషయం గమనార్హం. ఇంతవరకు ఆ కేసు చిక్కుముడి వీడక పోగా తిరిగి భారీ ఎత్తున బంగారం చోరీ చేసి దొంగలు పోలీసులకు సవాలు విసిరినట్లు అయిందని ప్రజలు చర్చించుకుంటున్నారు.



## అయుష్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో యుద్ధ వీరుడికి ఘన నివాళి

### అయుష్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలోకరాటే విద్యార్థుల ర్యాలీ

దేవరకొండ మే 09 వార్త మిర్రర్ :

భారతదేశం మరియు పాకిస్తాన్ మధ్య జరిగిన ఘర్షణలో శత్రువులతో పోరాడి వీర మరణం పొందిన మన దేశ వీరుడు మురళి నాయక్ స్మరణార్థంగా, ఆయన సేవలకు గౌరవం తెలిపే విధంగా అయుష్ కరాటే అకాడమీ విద్యార్థులు ఘన నివాళుల ర్యాలీ నిర్వహించారు. దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ భవనం నుండి ప్రారంభమై, డిండి మరియు వరకు సాగింది.బి వందలాది మంది కరాటే విద్యార్థులు దేశభక్తి నినాదాలతో, జాతీయ పతాకాలు పట్టుకుని పాల్గొన్నారు. విద్యార్థులు దేశం కోసం ప్రాణాలు అర్పించిన సైనికుల గొప్పతనాన్ని స్మరించుకుంటూ, యువతలో దేశభక్తి, సేవా భావాన్ని పెంపొందించే లక్ష్యంతో ఈ ర్యాలీ నిర్వహించబడింది.ఈ కార్యక్రమానికి మాస్టర్ చైతన్య నేతృత్వం వహించారు.ఆయన మాట్లాడుతూ,మన దేశాన్ని రక్షించేందుకు ప్రాణాలు అర్పించిన సైనికుల సేవలను గుర్తుంచుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత. ఈ ర్యాలీ ద్వారా మన విద్యార్థులకు దేశభక్తి గాఢంగా బోధింప చేయగలిగాం అని అన్నారు. ఈ సందర్భంగా పలువురు స్థానిక ప్రముఖులు, తల్లిదండ్రులు, పౌరులు పాల్గొని మురళి నాయక్ కి నివాళులు అర్పించారు. దేశానికి వీరంగా పోరాడిన సైనికుల స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని ప్రతినబూనారు.



## కళ్యాణ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి,

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి మే 09

చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని లక్కారం క్యాంప్ ఆఫీస్ లో చౌటుప్పల్ మండలం తూప్రాన్ పేట్ బక్క తట్ల గంగమ్మ కూతురు శిరీష కు మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి చేతుల మీదుగా 100116 /-ఒక్క లక్ష ఒక్క వంద పదహారు రూపాయలు కళ్యాణం చెక్కలని వారి కుటుంబానికి అందజేసిన ఎమ్మెల్యే రాజ్ గోపాల్ రెడ్డి ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తాడూరి వెంకట్ రెడ్డి,వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బ వెంకటయ్య,వెన్ రెడ్డి రాజు,మునుగోడు నియోజకవర్గం ఎన్నికల సమన్వయకర్త పబ్బు రాజు గౌడ్,మాజీ జెడ్పిటిసి చిలుకూరి ప్రభాకర్ రెడ్డి,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకుల ఇంద్రసేనా రెడ్డి, మండల అధ్యక్షుడు బోయ దేవేందర్, టౌన్ అధ్యక్షుడు సుర్వి నరసింహ గౌడ్, తూప్రాన్ పేట్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెంచల శ్రీనివాస్,గంధం ఆంజనేయులు,మంటిపల్లి రాజు, భాతరాజు నర్సింహా మరియు ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రిజిస్ట్రేషన్ కోసం స్లాట్ బుకింగ్ తప్పనిసరి




శేరిలింగంపల్లి వార్త మిర్రర్ : రిజిస్ట్రేషన్ ప్రక్రియను మరింత సులువ తరం చేసేందుకు రిజిస్ట్రేషన్, స్టాంప్స్ శాఖ స్లాట్ బుకింగ్ ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇప్పటికే మొదటి విడుదల పలు రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ ప్రక్రియ సత్ఫలితాలు ఇస్తుండడంతో రెండవ దశలో ఈనెల 12వ తేదీ నుంచి హైదరాబాద్, సౌత్ హైదరాబాద్, రంగారెడ్డి, శేరిలింగంపల్లి, ఫరూక్ నగర్, షాద్నగర్, మహేశ్వరం, వనస్థలిపురం, ఉప్పల్, ఘట్కేసర్ , నారాపల్లి, మల్కాజ్గిరి సబ్ రిజిస్టర్ కార్యాలయాల్లో స్లాట్ ప్రక్రియను అందుబాటులోకి తీసుకురానున్నారు. రిజిస్ట్రేషన్ ల కోసం సబ్ రిజిస్టర్ కార్యాలయాలకు విచ్చేసేవారు తప్పనిసరిగా స్లాట్ బుక్ చేసుకోవాలీ. ఒకేసారి అధిక మొత్తంలో రిజిస్ట్రేషన్ కోసం దస్తావేజులు రావడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఇలాంటి సమస్యలను అధిగమించేందుకే స్లాట్ బుకింగ్ తప్పనిసరనీ, స్లాట్ బుకింగ్ కోసం registration.telangana.gov.in వెబ్సైట్ ద్వారా తమకు అనుకూలమైన తేదీ, సమయానికి స్లాట్ బుక్ చేసుకొని నిర్దేశించుకున్న రోజున ఖచ్చితంగా హాజరై ప్రక్రియను పూర్తిచేసుకుని వెళ్లిపోవచ్చు. ప్రతిరోజు 48 స్లాట్స్ ల చొప్పున కేటాయిస్తున్నారు. దస్తావేజుల తాకిడి అధికంగా గల సబ్ రిజిస్ట్రార్లలో మాత్రం 144 స్లాట్స్ అందుబాటులో ఉంటాయి.



## విశ్వవిధిలో అతివలను వివస్త్రగా నిలబెట్టే వికృత క్రీడా అందాల పోటీలు.

### ఐద్వా జిల్లా కార్యదర్శి బట్టుపల్లి అనురాధ

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి మే 09

చౌటుప్పల్ పట్టణం కేంద్రంలోని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) పట్టణ కమిటీ ఆధ్వర్యంలో 16వ వార్డులోసభ్యత్వ క్యాంపియన్ నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి బట్టుపల్లి అనురాధ ఈ కార్యక్రమానికి హాజరై మాట్లాడుతూ విశ్వవీధిలో పతివలను వివస్త్రగా నిలబెట్టే వికృత క్రీడా అందాల పోటీలు తెలంగాణలో నిర్వహించొద్దని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రం అప్పుల ఊబిలో మగ్గుతుంటే అందాల పోటీలు నిర్వహించడం ఎందుకని ప్రశ్నించారు. స్త్రీ ఆత్మ గౌరవాన్ని భంగపరిచే ఈ అందాల పోటీలు ప్రతిఘటిద్దామని అన్నా విద్య వైద్యం ఉద్యోగంపై దృష్టి పెట్టి కార్మికుల వేతనాలు సరిగ్గా ఇవ్వలేని ప్రభుత్వం ప్రజల్లో ఆర్థిక పరిస్థితులు మెరుగుపరిచే విధంగా ప్రభుత్వాలు పనులు చేపట్టాలని ప్రభుత్వానికి ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేని అందాల పోటీలను నిర్వహించి బడా పెట్టుబడిదారులకు బిజినెస్ మాన్ లకు ఉపయోగపడే పోటీలను రేవంత్ రెడ్డి పెడుతున్నారని అన్నారు. మహిళల్లో వాళ్లపై వాళ్లకు ఉన్న ఆత్మవిశ్వాసాన్ని కోల్పోయే విధంగా పోటీలకు అనుమతించి రాష్ట్ర ప్రభుత్వం మీద ఉన్న విశ్వాసాన్ని పోగొట్టుకున్న కాబట్టి ఇచ్చిన హామీలు అమలుపరిచి ప్రజల్లో విశ్వాసాన్ని తీసుకురావాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నదని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు అవ్వారు రామేశ్వర్, జిల్లా కమిటీ సభ్యురాలు బత్తుల జయమ్మ పట్టణ నాయకురాలు చింతల రజిత, యాదమ్మ, సంధ్య, దేవేంద్రమ్మ, పుష్ప, వీణ, ఇందిరా తదితరులు పాల్గొన్నారు.

# దండకారణ్యంలో ఆదివాసుల కాళ్ళ కింద ఉన్న ఖనిజ సంపదను కార్పొరేట్లకు అప్పజెప్పేందుకు కేంద్ర ప్రభుత్వం చూస్తుంది.

### ఆపరేషన్ కాగార్ ని వెంటనే నిలిపివేయాలి.





వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి మే 09

చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో కందాల రంగారెడ్డి స్మారక విజ్ఞాన కేంద్రం సిపియం ఆఫీసులో కావలి యాదయ్య అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు పార్టీల ప్రజా సంఘాల నాయకులు సామాజికవేత్తలు పాల్గొని ప్రభుత్వం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యులు కురిమిద్దె శ్రీనివాసు సిపిఐఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బూరుగు కృష్ణారెడ్డి, టిఆర్ఎస్ జిల్లా నాయకులు పిఎసిఎస్ చింతల దామోదర్ రెడ్డి, ఐద్వా రాష్ట్ర నాయకురాలు బట్టుపల్లి అనురాధ, ఐలు జిల్లా అధ్యక్షులు అడ్వకేట్ తడక మోహన్, సి ఐ టి యూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం డి పాషా, తెలంగాణ ఉద్యమకారులు ఉప్పు కృష్ణ, కట్టెల లింగస్వామి, తదితరులు మాట్లాడుతూ గత కొన్ని నెలలుగా మధ్యభారతంలో ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసీల హననం జరుగుతుంది. ముఖ్యంగా దండకారణ్యంలో ఆదివాసుల కాళ్ళ కింద ఉన్న ఖనిజ సంపదను కార్పొరేట్లకు అప్పజెప్పేందుకు కేంద్ర ప్రభుత్వం కొన్ని దశాబ్దాలుగా ఉవ్విళ్లూరుతుంది. అందుకోసమే ఆదివాసులను అడవి నుండి మాయం చేయాలనుకుంటుంది. ఆదివాసులకు అండగా నిలబడిన మావోయిస్టులను ఏరివేస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం కూడా జరిగింది. అందుకోసం దేశ సరిహద్దుల్లో ఉండవలసిన లక్షల మిలటరీ సైన్యాన్ని మధ్యభారతంలో దింపి ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసులను హత్య చేస్తూ ఎన్కౌంటర్ పేరుతో కట్టుకథలు అల్లుతున్నారు. దండకారణ్యంలో నిక్షిప్తమై ఉన్న అపార ఖనిజ సంపదను దోచి కార్పొరేట్లకు అప్పజెప్పడానికి కేంద్ర ప్రభుత్వం ఆదివాసులను హత్యలు చేస్తుంది, ఈ హత్యలు ప్రజాస్వామ్యానికే ప్రమాదకరంగా మారి ప్రజాస్వామ్యాన్ని తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఈ సమస్యకు శాంతి చర్చలే పరిష్కారం అని నమ్ముతూ పౌర సమాజం హక్కుల సంస్థలు ఇటు ప్రభుత్వాన్ని అటు మావోయిస్టు పార్టీని శాంతి చర్చలకు ముందుకు రావాలని కోరాయి. హక్కుల సంస్థల ప్రతిపాదనకు స్పందించిన మావోయిస్టు పార్టీ శాంతించింది. అందుకో సానుకూల వాతావరణం కల్పించేందుకు తాత్కాలిక కాల్పుల విరమణ సిద్ధమని నాడు నేడు కూడా ప్రకటించింది. ప్రభుత్వం కూడా కాల్పుల విరమణ ప్రకటించి శాంతి చర్చల ప్రక్రియను ముందుకు తీసుకువెళ్లాలని సూచించింది. కానీ కేంద్ర ప్రభుత్వ స్పందించకపోగా పైగా తెలంగాణ చత్తీస్గఢ్ రాష్ట్రాల మధ్యన గల కర్రెగుట్టలపై భారీగా మిలటరీ ని మోహరించి, అడవిని చుట్టుముట్టాయి. ఈ పరిస్థితి ఆదివాసుల హననానికే దారితీస్తుందని మనకు స్పష్టంగా తెలుస్తుంది. ఇలాంటి ఆందోళనకర పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం కాల్పుల విరమణ ప్రకటించి మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు జరపాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మరొక పక్క రాష్ట్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ తో తమకు ఎలాంటి సంబంధం లేదని చర్చలకు తాము సానుకూలంగా ఉన్నామని కేంద్ర ప్రభుత్వంతో ఈ అంశంపై మాట్లాడుతామని ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ రేవంత్ రెడ్డి ప్రభుత్వం కర్రెగుటలలో తన బలగాలను పంపి ఈరోజు వారి మరణాలకు కారణమైందని ఆరోపించారు. ఈరోజు కర్రగుట్టలో చనిపోయిన గ్రేహౌండ్స్ బలగాల మరణాలకు ఎవరు బాధ్యత వహిస్తారు అని ప్రశ్నించారు? ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు పిల్లి శంకర్. సిపిఎం మండల కార్యదర్శి జి సైదులు. బి ఆర్ ఎస్ మండల నాయకులు ఉడుగు మల్లేశ్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పల్లె మధు. ఎస్ఎఫ్ఐ మండల జిల్లా కార్యదర్శి శ్రీను. సిపిఐ నాయకులు టంగుటూరి రాములు,టీజెస్ జిల్లా నాయకుల ఆంజనేయులు చారి, బీఎస్పీ మండల నాయకులు మాద రమేష్, బోయ యాదయ్య తదితరులు పాల్గొన్నారు. రౌండ్ టేబుల్ సమావేశంలో ఆమోదించిన రాజకీయ తీర్మానాలు. 1. ఆపరేషన్ కాగర్ ని వెంటనే నిలిపివేయాలి. 2. కర్రే గుట్టల పైనుంచి పార మిలిటరీ బలగాలను ఉపసరించుకోవాలి. 3. శాంతిని నెలకొల్పేందుకు వెంటనే కాల్పుల విరమణ ప్రకటించాలి. 4. కేంద్ర ప్రభుత్వ మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు జరపాలి.

# కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల లో 3.25 కోట్ల వ్యయంతో మౌలిక సదుపాయాల కల్పనకు శంకుస్థాపన





వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి మే 09 చౌటుప్పల్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల(కేజీబీవీ) ఆవరణలో 3.25 కోట్ల వ్యయం తో కస్తూరిబా గాంధీ బాలికల జూనియర్ కళాశాల భవన నిర్మాణం, మౌలిక సదుపాయాల కల్పనకు,శంకుస్థాపన చేసిన మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ గోపాల్ రెడ్డి జూనియర్ కళాశాల ను నిర్మించే ప్రదేశాన్ని కలియతిరిగి పరిశీలించి నాణ్యతతో భవనాన్ని నిర్మించాలని కాంట్రాక్టర్ కు సూచన చేయడం జరిగింది. తనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కస్తూర్బా బాలికల పాఠశాలకు కేటాయించిన స్థలాన్ని ఆక్రమించిన చుట్టుపక్కల వ్యక్తులు ఎవరైనా సర్వే చేయించి కబ్జాలను తొలగించి, కేటాయించిన పూర్తి స్థలాన్ని తీసుకోవాలని మండల చౌటుప్పల్ ఎమ్మార్వోకు ఆదేశాలు జారీ చేయడం జరిగింది.. చౌటుప్పల్ మండలం దామెర గ్రామంలో 23 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించిన మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తాడూరి వెంకట్ రెడ్డి,వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య,వెన్ రెడ్డి రాజు,మునుగోడు నియోజకవర్గం ఎన్నికల సమన్వయకర్త పబ్బు రాజు గౌడ్,మాజీ జెడ్పిటిసి చిలుకూరి ప్రభాకర్ రెడ్డి,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకుల ఇంద్రసేనా రెడ్డి, మండల అధ్యక్షుడు బోయ దేవేందర్, టౌన్ అధ్యక్షుడు సుర్వి నరసింహా గౌడ్, బత్తుల విప్లవ గౌడ్, ఉడుగు రమేష్, మోదుగాల రమేష్ గౌడ్, పాక చిరంజీవి,తదితరులు పాల్గొన్నారు.

# వ్యాపారంలో విజయానికి పంచతంత్రం..వారెన్ బఫెట్ చెప్పిన ఐదు సూత్రాలు

ప్రతి ఒక్కరూ తాము ఉన్నత స్థాయికి ఎదగాలని, డబ్బులు బాగా సంపాదించాలని, వ్యాపారంలో ప్రగతి సాధించాలని కోరుకుంటారు. ఆ లక్ష్యాలను నెరవేర్చుకోవడానికి రేయింబవళ్లు కష్టబడతారు. వారిలో కొందరు విజయతీరాలకు చేరుకుంటారు. మరికొందరు మధ్యలోనే ఆగిపోతారు. ఏదైనా అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవడానికి క్రమశిక్షణ, ఓర్పు, సహనం, ముందు చూపు అవసరం.మన కళ్ల ముందే విజయాలు సాధించిన వ్యక్తులు మనకు ఆదర్శంగా నిలుస్తారు. వారిలో అమెరికాకు చెందిన వ్యాపారవేత్త వారెన్ బఫెట్ ఒకరు. ఆయన పెట్టుబడి దారుడు, పరోపకారి, బెర్క్ షైర్ హాత్ వే కంపెనీ చైర్మన్. ప్రపంచంలోని అత్యంత ధనవంతుల్లో ఒకరు. మంచి పెట్టుబడులు పెట్టాలంటే తెలుసుకోవాల్సిన ఐదు విషయాలను ఆయన వెల్లడించారు. ఆ విషయాలను ఇప్పుడు తెలుసుకుందాం.డబ్బును పోగొట్టుకోకూడదుమూలధనాన్ని రక్షించుకోవడం పెట్టుబడిదారుల ప్రధాన బాధ్యతని బఫెట్ తెలిపారు. డబ్బును పోగొట్టుకుంటే మీరు రేసులో వెనుకబడిపోతారు. దాని నుంచి కోలుకోవడం కష్టంగా మారుతుంది. ఒక స్టాక్ లో 50 శాతం నష్టపోతే, మరో దానిలో లాభాలు సంపాదించాలి. ముఖ్యంగా పెట్టుబడిలో నష్టాలను నివారించడానికి కష్టబడి పనిచేయడమే సరైన మార్గమని ఆయన నమ్మకం.కంపెనీల కొనుగోలుఎక్కువ డబ్బులు పెట్టి ఒక మంచి కంపెనీని కొనడం కంటే, తక్కువ డబ్బులతో మధ్యస్త కంపెనీ కొనడం ఉత్తమమని బఫెట్ చెబుతారు. దీని వల్ల తక్కువ ధరకు నాణ్యత కలిగిన కంపెనీలో పెట్టుబడి పెట్టే అవకాశం కలుగుతుంది. ఇది వ్యాపార రంగంలో పెద్ద మార్పును తీసుకువస్తుంది. దీర్ఘకాలంలో లాభాల బాటలో పయనించే అవకాశం కలుగుతుంది.ఇవి కూడా చదవండభావోద్వేగాలను దూరంగా ఉండడం పెట్టుబడి దారుడి ప్రధాన లక్షణం. దీనినే బఫెట్ వ్యతిరేక పెట్టుబడి కళగా అభివర్ణించారు. మార్కెట్ బాగున్నప్పుడు ధరలు పెరుగుతాయి. దీని వల్ల నష్టాలు కలుగుతాయి. అయితే భయాందోళనలు తలెత్తినప్పుడు స్టాక్ ల ధరల తగ్గే అవకాశం ఉంది. ఆ సమయంలో మంచి డీల్ లను అందుకోవచ్చు.ఓర్పుపెట్టుబడిదారుడికి ఓర్పు అనేది చ్ఛాలా అవసరం. పెట్టుబడి పెట్టిన వెంటనే లాభాల కోసం ఆలోచించడం సరి కాదు. మంచి కంపెనీలో ఏళ్ల తరబడి డబ్బులను నిల్వ ఉంచాలి. అసహనంగా ఉండే వారు తరచూ అధిక ధరలకు స్టాక్ లను కొనుగోలు చేసి, మార్కెట్లు పెరిగినప్పుడు తక్కువ ధరకు అమ్మేస్తారు. తద్వారా ఓపికతో వేచి ఉండే ఇన్వెస్టర్లు లాభాలు పొందుతారు.కొత్త మార్గాలుడబ్బులను సంపాదించడానికి నిరంతరం కొత్త మార్గాలను అన్వేషించాలి. ఒక రకంగా చెప్పాలంటే నిద్ర పోతున్నప్పుడు కూడా డబ్బు సంపాదించడానికి మార్గం ఆలోచించాలి.



లేకపోతే మీరు చనిపోయే వరకూ పని చేస్తూనే ఉంటారని వారెన్ బఫెట్ చెప్పారు. అంటే స్టాక్ లు, డివిడెంట్లు, మ్యూచువల్ ఫండ్స్ లో డబ్బులను ఇన్వెస్ట్ చేయాలి. మీరు నిద్రపోతున్నప్పుడు కూడా అవి పెరుగుతూనే ఉంటాయి. కొత్త మార్గాలను అన్వేషించడం పెట్టుబడి దారుడికి చాలా అవసరం.



## పసిడి ప్రియులకు ఊరట..

## భారీగా దిగొచ్చిన బంగారం ధరలు..! ఇవాళ్టి ధరలు ఇవే..

సామాన్యులకు శుభవార్త..! గత కొన్ని రోజులుగా సామాన్యులకి చుక్కలు చూపిస్తున్న పసిడి పరుగులకు కాస్త కళ్లెం పడినట్లుగా ఉంది.. బంగారం ధరలు నేడు భారీగా తగ్గాయి. భారత్, పాకిస్తాన్ మధ్య యుద్ధం నేపథ్యంలో బంగారం ధరలు తగ్గాయి. యుద్ధ ప్రభావాలు కాకుండా ప్రపంచ మార్కెట్ సహజ ప్రవర్తన ధరల తగ్గుదలకు కారణం అంటున్నారు మార్కెట్ విశ్లేషకులు. బంగారం కొనుగోలు చేయాలని ప్లాన్ చేస్తున్న వారికి ఇది గొప్ప గుడ్ న్యూస్ అంటున్నారు నిపుణులు.. ఎందుకంటే నేడు బంగారం ధర భారీగా తగ్గింది. ఈ రోజు తాజా బంగారం ధరలు ఎలా ఉన్నాయి? దేశంలోని ప్రధాన నగరాల్లో బంగారం వెండి ధరలు ఎలా ఉన్నాయో పూర్తి సమాచారం ఇక్కడ తెలుసుకుందాం....దేశంలో ఈ రోజు (శనివారం మే10న) 24 క్యారెట్ల బంగారం ధర 1 గ్రాము రూ.9,834లుగా ఉంది. అది 22 క్యారెట్ల బంగారం ధర 1 గ్రాముకు రూ.9,014లుగా ఉంది. అటు18 క్యారెట్ల బంగారం ధర 1 గ్రాముకు రూ.7,375లుగా పలుకుతోంది. ఇకపోతే, దేశంలోని ప్రధాన నగరాల్లో బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయో ఇక్కడ తెలుసుకుందాం..దేశంలోని ప్రధాన నగరాల్లో ఇవాళ్టి బంగారం ధరలు ఇలా ఉన్నాయి%చెన్నైలో 22 క్యారెట్ల ధర రూ.90,140, 24 క్యారెట్ల రేటు రూ.98,340 గా ఉంది. బెంగళూరులో 22 క్యారెట్ల ధర రూ.90,140, 24 క్యారెట్ల ధర రూ.98,340 గా ఉంది. హైదరాబాద్‌లో 22 క్యారెట్ల బంగారం ధర రూ.90,140, 24 క్యారెట్ల ధర రూ.98,340 గా ఉంది.విశాఖపట్నంలో 22 క్యారెట్ల బంగారం ధర రూ.90,760, 24 క్యారెట్ల ధర రూ.99,010 గా ఉంది. విజయవాడలో 22 క్యారెట్ల బంగారం ధర రూ.90,140, 24 క్యారెట్ల ధర రూ.98,340 గా ఉంది.వెండి ధరలు..ఇక ఇవాళ్టి వెండి ధరల విషయానికి వస్తే.. పసిడితో పాటే వెండి ధర కూడా దిగొచ్చింది. గ్రాము 110.90లు ఉండా, కిలో వెండి ధర రూ.1,10,900లుగా పలుకుతోంది.హైదరాబాద్‌లో కిలో వెండి ధర రూ.1,10,900విజయవాడ, విశాఖపట్నంలో రూ.1,11,100ఢిల్లీలో వెండి కిలో ధర రూ.98,900ముంబైలో రూ.98,900బెంగళూరులో రూ.98,900చెన్నైలో రూ.1,10,900 లుగా ఉంది.కాగా, ఈ ధరలు ఉదయం 6 గంటలకు నమోదైనవిగా గమనించగలరు. ఒకవేళ మీకు బంగారం, వెండి ధరల లేటెస్ట్ అప్‌డేట్ గురించి తెలియాలంటే ఈ మొబైల్ నెంబర్‌కు 8955664433కు మిస్డ్ కాల్ ఇవ్వవచ్చు.



## మే 15 వరకు పౌర విమానాల

## రాకపోకలపై ఆంక్షలు.. 32 విమానాశ్రయాలు మూసివేత!

ఆపరేషన్ సిందూర్ కింద పాకిస్తాన్‌పై కొనసాగుతున్న చర్యల మధ్య భారత ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది . దేశవ్యాప్తంగా 32 విమానాశ్రయాలను గురువారం (మే 15) ఉదయం 5:29 గంటల వరకు మూసివేయాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. పాకిస్తాన్ చేస్తున్న క్షిపణి, డ్రోన్ దాడులను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. మే 15 వరకు పౌర విమానాల రాకపోకలపై ఆంక్షలు.. 32 విమానాశ్రయాలు మూసివేత! ఆపరేషన్ సిందూర్ కింద పాకిస్తాన్‌పై కొనసాగుతున్న చర్యల మధ్య భారత ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది . దేశవ్యాప్తంగా 32 విమానాశ్రయాలను గురువారం (మే 15) ఉదయం 5:29 గంటల వరకు మూసివేయాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. పాకిస్తాన్ చేస్తున్న క్షిపణి, డ్రోన్ దాడులను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది.అయితే, దేశవ్యాప్తంగా 24 విమానాశ్రయాలలో విమాన కార్యకలాపాలు శనివారం (మే 10) వరకు మూసివేస్తున్నట్లు పౌర విమానయాన మంత్రిత్వ శాఖ గురువారం (మే 8) ప్రకటించింది. కానీ పాకిస్తాన్ నుండి నిరంతర దాడులు జరిగిన తరువాత, కేంద్ర ప్రభుత్వం తేదీని పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది.మే 15 వరకు కేంద్ర ప్రభుత్వం మూసివేయాలని నిర్ణయించిన 24 విమానాశ్రయాలలో చండీగఢ్, శ్రీనగర్, అమృత్సర్, లూథియానా, భుంటార్, కిషన్‌గఢ్, పాటియాలా, సిమ్లా, జైసల్మేర్, పఠాన్‌కోట్, జమ్మూ, బికనీర్, లేహ్, పోర్‌బందర్ సహా అనేక ఇతర విమానాశ్రయాలు ఉన్నాయి. ఈ విమానాశ్రయాలన్నీ భారతదేశం-పాకిస్తాన్ సరిహద్దుకు సమీపంలో ఉన్న నగరాల్లో ఉన్నాయి. ప్రస్తుత పరిస్థితిలో, భద్రత దృష్ట్యా ఇవన్నీ మూసివేయడం జరుగుతుందని కేంద్ర ప్రభుత్వం తెలిపింది.భారతదేశం-పాకిస్తాన్ మధ్య కొనసాగుతున్న వివాదం దృష్ట్యా, అనేక విమానయాన సంస్థలు ప్రయాణీకులకు ప్రయాణ సలహాను జారీ చేశాయి. విమానాశ్రయ మూసివేతలు, పెరిగిన భద్రతా ప్రోటోకాల్‌ల గురించి ప్రయాణీకులు తమను తాము అప్‌డేట్ చేసుకోవాలని కోరుతూ కంపెనీలు సలహాలు జారీ చేశాయి.ఎయిర్ ఇండియా శుక్రవారం (మే 9) సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ %శ%లో ఒక పోస్ట్‌ను షేర్ చేసింది. "విమానయాన అధికారులు జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం, దేశవ్యాప్తంగా అనేక విమానాశ్రయాల మూసివేత ప్రస్తుతానికి కొనసాగుతుంది. ఇంతలో, జమ్మూ, శ్రీనగర్, లేహ్, జోధ్‌పూర్, అమృత్సర్, చండీగఢ్, భుజ్, జామ్‌నగర్, రాజ్‌కోట్‌లకు బయలుదేరే అన్ని విమానాలు గురువారం (మే 15) ఉదయం 5:29 గంటల వరకు రద్దు చేయబడ్డాయి" అని ఎయిర్‌లైన్ కంపెనీ పోస్ట్‌లో రాసింది. "ప్రస్తుత సమయంలో, ప్రయాణానికి చెల్లుబాటు అయ్యే టిక్కెట్లను కలిగి ఉన్న వినియోగదారులందరికీ ప్రయాణ మార్పు లేదా టికెట్ రద్దుపై పూర్తి వాపసు విషయంలో ధరపై ఒకేసారి తగ్గింపు ఇవ్వడం జరుగుతుంది" అని కంపెనీ పేర్కొంది.అదే సమయంలో, మే 15 వరకు 24 నగరాల్లో విమానాశ్రయాలు మూసివేయంతో విమానాల రద్దుకు సంబంధించి విమానయాన సంస్థ ఇండిగో కూడా ఒక పోస్ట్‌ను షేర్ చేసింది.

## ఆ పథకంలో పెట్టుబడిని ముందుగానే

## ఉపసంహరిస్తున్నారా? జరిమానా బాదుడు తప్పదంతే..

భారతదేశంలోని పెట్టుబడిదారులు నమ్మకమైన రాబడి కోసం చిన్న మొత్తాల పొదుపు పథకాల్లో పెట్టుబడిని ఇష్టపడుతూ ఉంటారు. అయితే బ్యాంకు ఫిక్స్‌డ్ డిపాజిట్ల వడ్డీ రేట్లు తగ్గుతున్న సమయంలో ప్రభుత్వ మద్దతుతో కూడిన చిన్న పొదుపు పథకం అయిన సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్ (ఎస్‌సీఎస్ఎస్)లో పెట్టుబడి పదవీ విరమణ పొదుపులు చేసే వారికి అనువుగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. అయితే ఈ పథకంలో మన పెట్టుబడికి ముందస్తుగా ఉపసంహరిస్తే జరిమానా బాదుడు తప్పదని నిపుణులు చెబుతున్నారు.దేశంలో చాలా మంది పదవీ విరమణ తర్వాత సౌకర్యంగా జీవించడానికి ముందు నుంచే పెట్టుబడి పథకాల్లో పెట్టుబడి పెడుతూ ఉంటారు. వ్యక్తులు తక్కువ రిస్క్ ఉన్న పథకాల్లో పెట్టుబడి పెట్టి వారి పదవీ విరమణ అవసరాలను తీర్చడానికి స్థిర వడ్డీ ఆదాయంపై ఆధారపడతారు. ప్రస్తుతం అన్ని చిన్న పొదుపు పథకాలో ఎస్‌సీఎస్ఎస్ సంవత్సరానికి అత్యధిక వడ్డీ రేటు 8.20% అందిస్తోంది. ఈ వడ్డీని త్రైమాసికానికి ఒకసారి ఏప్రిల్, జూలై, అక్టోబర్, జనవరి నెలల మొదటి పని దినాన నేరుగా పొదుపు ఖాతాలో జమ చేస్తారు.